ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్



కెవ్వు.. కేక..

జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జిల్లా యువజనోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల విద్యార్థులు తమ నృత్యాలతో హోరెత్తించారు.

– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

నేడు మచిలీపట్నానికి సీఎం చంద్రబాబు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం మచిలీపట్నంలో నిర్వహించనున్న స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రానున్నారు. ఏర్పాట్లను మంత్రులు కొల్లు రవీంద్ర, పి.నారాయణలతో పాటు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాస గృహం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.20 గంటలకు మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. ఆ తరువాత ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంతంలో నిర్వహించే స్వచ్ఛతే సేవలో పాల్గొంటారు. 10.45 గంటలకు అక్కడ నుంచి బయలు దేరి కోనేరు సెంటరులో సుందరీకరణ పనులు పరిశీలిస్తారు. తరువాత 11.05 గంటలకు బస్టాండ్ సమీపంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే సభలో పాల్గొని 12.55 గంటల వరకు సభలో పాల్గొన్నవారితో ముఖాముఖి నిర్వహించడంతోపాటు సందేశం అందిస్తారు. తిరిగి మధ్యాహ్నం 1.05 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి ఆంధ్రజాతీయ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని 1.10 గంటలకు అక్కడ నుంచి బయలుదేరతారు. 1.30 గంటలకు తాడేపల్లిలో నివాస గృహానికి చేరుకుంటారు. మంత్రులు కొల్లు రవీంద్ర, పి.నారాయణలతో పాటు కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావులు ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాపూ స్ఫూర్తి.. ప్రగతి దీప్తి

పల్లెల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి

గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు

దేశం అభివృద్ధి చెందడం అంటే.. అద్దాల మేడలు రంగుల గోడలు కాదు.. పల్లెసీమలూ ప్రగతి బాట పట్టాలి.. – గాంధీజీ

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలంటూ గాంధీ మహాత్ముడు ఆకాంక్షించారు. కానీ గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల ప్రగతిని పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో ఐదేళ్లూ అన్ని పంచాయతీలు నిధులు లేక తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. అలాంటి సంక్షోభం నుంచి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చొరవతో ప్రగతి దిశగా అడుగులు పడుతున్నాయి. నేడు గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

– మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రకృతి సిద్ధమైన రంగులు, ఆకులు, పువ్వులతో రూపుదిద్దుకునే పెడన కలంకారీ ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో మంచి ఆదరణ ఉంది. సందర్శకులతో పెడన వీధులు కళకళలాడుతున్నాయి. దాదాపు 5వేల మంది కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. పెడనతో పాటు కప్పలదొడ్డి, పోలవరం గ్రామాల్లోనూ కలంకారీ విస్తరించింది. బాపూ కోరుకున్నట్లు గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తోంది. తద్వారా గ్రామీణ ఉపాధిని కలంకారీ పెంపొందిస్తోంది. బెడ్ షీట్లు, డ్రెస్ మెటీరియల్స్, ఫర్నిషింగ్‌లు, కుర్తీలు, చందేరీ,



కలంకారీ హస్తకళ

మహేశ్వరీ, కాటన్, సిల్క్ చీరలు, చున్నీలు రూపుదిద్దుకుంటున్నాయి. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ విద్యార్థులు పెడన వచ్చి డిజైన్లను మరింత ఆకర్షణీయంగా రూపుదిద్దడంలో ఇక్కడి కళాకారులకు తర్ఫీదునిస్తున్నారు. కూటమి ప్రభుత్వ వచ్చాక కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పెడన

100 రోజుల్లో పల్లెకు నిధులు

పంచాయతీలకు కేటాయించే ఆర్థిక సంఘ నిధులను గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘ నిధులు విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో 281 పంచాయతీలకు టైడ్ నిధులు రూ.11.09 కోట్లు, అన్‌టైడ్ రూ.7.39కోట్ల చొప్పున మొత్తం రూ.18.48 కోట్లు విడుదల అయ్యాయి. ఆయా గ్రామాల్లో వసతులు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామాల్లోని సంపద కేంద్రాలను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

రూ.110 కోట్ల ఉపాధి నిధులతో పనులు

ఉపాధి హామీ నిధులను గత వైకాపా ప్రభుత్వం మళ్లించడంతో గ్రామాల్లో అంతర్గత రహదారులు, శ్మశాన వాటికలు, డ్రెయిన్లు అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి మండలానికి రూ.3 కోట్ల వరకు కేటాయించారు. ఇప్పటికే రూ.110 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, శ్మశానవాటికలు, సీసీడ్రైన్ల పనులు చేపడుతున్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన


★ జిల్లాలోని 25,323 స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు బ్యాంకు రుణాలతో స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతుంటారు. వైకాపా ప్రభుత్వం వీటి నిర్వీర్యం చేసింది. గత ప్రభుత్వంలో సంఘాలు రూ.20 లక్షల వరకు రుణం తీసుకున్నా రూ.3లక్షలకు మాత్రమే వడ్డీ రాయితీ వర్తింపచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.10లక్షల వరకు వడ్డీ రాయితీ అందించాలని నిర్ణయించడంతో మహిళలు స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు.

మహిళా అక్షరాస్యతలో వ్యత్యాసం

ఉమ్మడి జిల్లాలో 2011 లెక్కల ప్రకారం సగటు అక్షరాస్యత **73.74%**

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు: **63.56%**

★ గాంధీజీ ఆకాంక్షలకు అనుగుణంగా మహిళలు నూరుశాతం అక్షరాస్యత దిశగా అందరూ అడుగులు వేయాల్సి ఉంది.



3,249 రోజులుగా స్వచ్ఛ ఉద్యమం

చల్లపల్లి, న్యూస్‌టుడే

స్వచ్ఛ భారతావనిని నేనెంతో ప్రేమిస్తానన్న మహాత్ముని మాటలను అక్షరాలా అమలు చేసి చూపుతోంది చల్లపల్లి ఉద్యమం. ఇందుకు త్రికరణశుద్ధిగా స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు అంకితమయ్యారు. 3249 రోజులుగా గ్రామంలోని మురుగు కల్మషాలను, చెత్త గుట్టలను శుభ్రం చేస్తూ కర్మ వీరులు విశ్రమించక ముందుకు సాగుతున్నారు. ఇందుకు ముందుండి నడిపిస్తున్నది స్వచ్ఛ యోధుడు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్. వ్యక్తులకే కాకుండా సమాజానికి చికిత్స ప్రారంభించారు ఆయన. ఆయన వెంట డాక్టర్ టి.పద్మావతి, పలువురు కార్యకర్తలు భుజం భుజం కలిపి అడుగులు వేస్తున్నారు. మరెన్నో గ్రామాలు, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 2014 నవంబరు 12న డాక్టర్ డి.ఆర్.కె. ప్రసాద్ చీపురు పట్టుకుని శుభ్రం చేసుకుంటూ ముందుకు వెళుతుంటే ఆయన వెంట మరో 14 మంది నడిచారు.

స్ఫూర్తి పాఠాలెన్నో..

★ తెల్లవారుజామునే లేచి ఉదయం 4.30 గంటల నుంచే తలపై దీపాలు ధరించి... చీపుర్లు, పారలు, కత్తులు, గొర్రులు, పిచ్చి మొక్కల తొలగింపు యంత్రాలతో చెత్త, వ్యర్థాలపై యుద్ధమే చేస్తారు. ట్రాక్టర్ల కొద్దీ సేకరించిన వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. దాదాపు గత పదేళ్లుగా ఇదే కర్తవ్యాన్ని మనసా, వాచా, కర్మణా కార్యకర్తలు పాటిస్తున్నారు. ప్రస్తుతం చల్లపల్లి రహదారుల రూపురేఖలు మారిపోయాయి. ★ ప్రతి రహదారి వెంట మొక్కలను నాటి ఉద్యానవనాలుగా తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు 30 వేల మొక్కలకు పైగా నాటి సంరక్షిస్తున్నారు.



స్వచ్ఛ సేవతో అద్దంలా పల్లె దారి

యువతకు మార్గదర్శనం



గాంధీజీ జీవితానికి సంబంధించిన ఫొటోలు

పటమట, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ గురించి నేటి తరానికి తెలియజేసేందుకు విజయవాడ నాస్తిక కేంద్రం ఆవరణలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో గాంధీ నేషనల్ మ్యూజియం నుంచి ఫొటోలు సేకరించి 'బాపు దర్శన్' పేరుతో 2019లో ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. మహాత్ముడి బాల్యం, విద్యాభ్యాసం, విదేశీ విద్య, స్వాతంత్ర్యం పోరాటం తదితర అంశాలు తెలియజేసేలా ఫొటోలు ఉన్నాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు.


మహాత్ముని బాటలోనే..



సేవాగ్రామ్ ఆశ్రమంలో మహాత్ముడితో మా కుటుంబ సభ్యులంతా రెండేళ్లు ఉన్నాం. ఆయన బాటలోనే నేటికీ నడుస్తున్నాం. నేటి తరం ఆయన గురించి తెలుసుకోవాలనే బాపు దర్శన్ ఏర్పాటు చేశాం.

– జి.రష్మి, బాపు దర్శన్ కార్యదర్శి

నేటి తరానికి ఆదర్శం



గాంధీజీ.. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించిన మహనీయుడు. ఆయన జీవితం ప్రపంచానికే మార్గదర్శనం. నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలనే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జి.సమరం, బాపు దర్శన్ ఛైర్మన్

అమ్మ పండగ.. అదిరిపోయేలా!

వెలిగిపోతున్న ఇంద్రకీలాద్రి ✪ తుది దశకు చేరిన దసరా ఏర్పాట్లు



ఘాట్‌రోడ్డులో..



కొండంతా ధగధగ

ఈనాడు డిజిటల్, అమరావతి, – న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు దుర్గగుడి వద్ద అన్ని ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అమ్మవారి పండగను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఉత్సవాల నిర్వహణ విషయంలో గతేడాది లోపాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే ఈ ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే క్యూలైన్లు, స్నానఘాట్‌లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ప్రకాశం బ్యారేజీలో నీరు అధికంగా ఉండడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దుర్గా, పద్మావతి ఘాట్‌ల వద్ద, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తుల కోసం పున్నమి ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు 700 షవర్లు ఏర్పాటు చేశారు.



విద్యుత్తు కాంతుల్లో ఆలయ పరిసరాలు



క్యూలైన్లు సిద్ధం

ప్రసాదం కౌంటర్ మార్పు..

అమ్మవారిని దర్శించుకుని శివాలయం మెట్ల మార్గంలో బయటకు వచ్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కిందకు దిగిన తర్వాత శివాలయం మెట్ల సమీపంలో అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లికార్జున మహామండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్రసాదాల విక్రయాలను కనకదుర్గానగర్‌కు మంగళవారం మార్చారు. రెండు రోజులు ముందుగానే భక్తులకు కనకదుర్గానగర్‌లోని కౌంటర్లలో లడ్డు, చక్రపొంగలి, పులిహోర ప్రసాదాలను విక్రయిస్తున్నారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయ మెట్లు మీదుగా మల్లికార్జున మహామండపానికి వచ్చిన వారు ప్రత్యేక క్యూలైన్‌లో అన్నప్రసాదం స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. బఫే విధానంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ★ సాంస్కృతిక కార్యాక్రమాల వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంలో తీవ్ర ఆలస్యమైంది. సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యే కళాకారులకు నేటి వరకు సమాచారం పంపలేదు. వేదికను కనకదుర్గానగర్ ఎంట్రెన్స్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించి యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించారు. దీంతో నవరాత్రుల్లో కళాకారుల ప్రదర్శనలకు మార్గం సుగమం అయ్యింది. దరఖాస్తులు 450 రాగా వాటిల్లో 300 వరకు ప్రదర్శనకు అవకాశం ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పూర్తయిన క్యూలైన్ల పనులు..

కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి ఘాట్ రోడ్డు మీదుగా రెండు కి.మీల మేర నడుచుకుంటూ వెళ్లి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. గతేడాది ఉత్సవాలు ప్రారంభమయ్యే వరకు క్యూలైన్లు, కేశఖండనశాల పనులు జరిగాయి. ఈసారి అధికారులు అప్రమత్తమై రెండు రోజులు ముందుగానే పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఘాట్ రోడ్డులోని మొదటి మలుపు వద్ద రక్షణ గోడ పనులు తుది దశకు చేరుకున్నాయి. కొంతమేర క్యూలైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రద్దీకి తగ్గట్లుగా క్యూలైన్ల సమీపంలోనే లగేజీ, పాదరక్షలు భద్రపర్చుకునేందుకు క్లాక్ రూములు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నిచోట్లా అప్రమత్తం చేస్తూ..

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను ఎక్కడికక్కడ అప్రమత్తం చేసేందుకు ప్రతిచోటా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. భక్తులు క్యూలైన్‌లో ఉన్నప్పుడు తోపులాటకు గురిచేసి విలువైన వస్తువులను అపహరించే ప్రయత్నం చేసే దొంగలున్నారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక బోర్డులు అన్నిచోట్లా ఏర్పాటు చేశారు. ప్రసాదాల కౌంటర్లు.. అన్నదాన మార్గం చూపే బోర్డులు అన్ని చోట్లా సిద్ధం చేశారు. భక్తులు ఈ సూచికలను చూసుకుంటూ ఆయా కౌంటర్ల దగ్గరకు ఎవరినీ అడిగే అవసరం లేకుండా వెళ్లవచ్చు. ★ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు, స్నానఘాట్‌లు, కేశఖండనశాల ఇలా ప్రతిచోటా తాగునీటి ట్యాంకులు పెట్టారు. కేశఖండనశాల, ఘాట్‌రోడ్లలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాట్లు చేశారు.

113 మద్యం దుకాణాలకు గెజిట్ విడుదల

✪ ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

✪ షాపులకు గరిష్ఠంగా రూ.85లక్షల శ్లాబ్ నిర్ధరణ



ఈనాడు, అమరావతి: నూతన మద్యం పాలసీలో భాగంగా దుకాణాలను ప్రభుత్వం ప్రైవేటుకు వ్యక్తులకు అప్పగిస్తోంది. వైకాపా హయాంలో తీసుకొచ్చిన ప్రభుత్వ దుకాణాలు రద్దు కానున్నాయి. ఈ నెల 12 నుంచి ప్రైవేటు షాపులు రానున్నాయి. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ జిల్లా మద్య నిషేధ, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం గెజిట్ విడుదల చేశారు. రెండేళ్ల కాలపరిమితితో 2026 సెప్టెంబరు 30 వరకు ఇది అమలులో ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 113 షాపులను నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో విధివిధానాలను పొందుపరిచారు. ఇవికాకుండా అదనంగా మరికొన్ని షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించనున్నారు. వీటికి సంబంధించిన నోటిఫికేషన్ తర్వాత జారీ చేయనున్నారు. ఒక్కో వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చు. ప్రతి దరఖాస్తుకు విధిగా రూ.2లక్షల రుసుము చెల్లించాలి. ఈ మొత్తాన్ని వెనక్కి ఇవ్వరు. షాపు కేటాయించిన రోజే మొదటి విడత రిటైల్ ఎక్సైజ్ పన్ను చెల్లించాల్సి ఉంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల్లో ఏదో ఒక విధానంలో షాపుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మద్యం దుకాణాల నుంచి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిటైల్ ఎక్సైజ్ పన్నును నాలుగు శ్లాబుల్లో నిర్ణయించారు. రెండో ఏడాది 10 శాతం మేర పన్ను పెంపు ఉంటుంది.

విజయవాడ నగరంలో అత్యధికంగా 39 షాపులు

గెజిట్‌లో ప్రకటించిన 113 షాపుల్లో అత్యధికంగా విజయవాడ నగరపాలిక పరిధిలో నోటిఫై చేశారు. ఆయా నగరపాలికలు, పురపాలికలు, మండలాల్లోని జనాభా ఆధారంగా దుకాణాల సంఖ్యను నిర్ణయించారు. నగరంలో 39 దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. వీటికి ఏడాదికి రూ.85లక్షల మేర రుసుము చెల్లించాల్సి ఉంది. ఆ తర్వాత విజయవాడ గ్రామీణ మండలంలో 10 చొప్పున కేటాయించారు.

గతంలో జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లోనే దరఖాస్తులను స్వీకరించారు. ఈసారి ఆఫ్‌లైన్‌లో జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను తీసుకుంటున్నారు. నగరంలో ఉన్న విజయవాడ, ఈస్ట్, వెస్ట్ స్టేషన్లతో పాటు గ్రామీణంలో మైలవరం, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరులోని ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు సమర్పించవచ్చు.

11న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వేలం

గెజిట్ విడుదల కావడంతో మంగళవారం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు నిర్దేశించారు. 11న నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 8గంటల నుంచి ఆయా దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. 12వ తేదీ నుంచి దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చు.


బాపు ప్రదర్శన టెండర్లలో కక్కుర్తి!

గుట్టుచప్పుడు కాకుండా అప్పగింత
రూ.3.36 లక్షల నష్టం

ఈనాడు, అమరావతి

గత ఆగస్టు నెల.. వర్షాకాలం.. వ్యాపారాలు అంతంతమాత్రం.. అయినా నెల రోజులకు ఆ ప్రాంగణాన్ని రూ.8.26లక్షలకు పాడుకున్నారు. మరో రూ.లక్ష చెల్లించి అదనంగా మరికొన్ని రోజులు పొడిగించారు. ప్రస్తుతం పండగల సీజన్.. ముఖ్యంగా వస్త్రవ్యాపారం పుంజుకునే రోజులు.. ఆదాయం ఎంత ఉండాలి..? కనీసం పది శాతం అయినా పెరగాలని కోరుకుంటారు. కానీ అదే ప్రాంగణానికి నెలకు రూ.4.90లక్షలే దక్కించుకున్నారు. అంటే దాదాపు రూ.3.36 లక్షల నష్టం.

– బాపు ప్రదర్శనశాల ప్రాంగణం వేదిక వస్త్ర ప్రదర్శన దుకాణాలకు ఇచ్చిన తీరు ఇది.



పోటీ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా ఒక వ్యక్తికి అతితక్కువకు కట్టబెట్టిన వైనం వెలుగుచూసింది. దీనిపై మిగిలిన చేనేత సంఘాలు గుర్రుగా ఉన్నాయి. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బహిరంగంగా టెండర్ పిలవాలని డిమాండ్ చేస్తున్నాయి.

విజయవాడ బందరు రోడ్డులో ఉన్న బాపు మ్యూజియానికి దశాబ్దాల చరిత్ర ఉంది. గతంలో విక్టోరియా జూబ్లీ మ్యూజియంగా ఉండేది. దాదాపు 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవనం ఉంది. 1921లో పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని ఇక్కడే మహాత్మాగాంధీ ఆవిష్కరించారు. 1962లో దీన్ని ఆర్కియాలజీ శాఖ స్వాధీనం చేసుకుంది. నాడు దీనిని బాపు మ్యూజియంగా మార్చారు. ఇందులో అమూల్యమైన వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనశాలలో పర్యాటకుల సందర్శనకు ప్రవేశ రుసుము పెద్దలకు రూ.5, పిల్లలకు రూ.2 నిర్ణయించారు. 2019కు ముందు ప్రభుత్వం కొన్ని నిధులు నిర్వహణ కోసం మంజూరు చేసేది. నాటి ప్రభుత్వంలో బాపు మ్యూజియం ఆధునికీకరణకు రూ.8కోట్లు నిధులు అందించింది. ఈ నిధులతో ప్రత్యేక లైటింగ్ వ్యవస్థను పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేశారు.

చేనేత ప్రదర్శనలు..!

నిర్వహణ ఖర్చుల కోసం అని మ్యూజియం ప్రాంగణంలో చేనేత వస్త్ర ప్రదర్శనలకు అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు. సహకార రంగంలో పనిచేస్తున్న చేనేత సంఘాలు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసుకున్నాయి. మొత్తం మీద 90 ప్రదర్శన దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి పోటీ ఏర్పడటంతో టెండర్ల ద్వారా అప్పగించేవారు. ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారికి ఇస్తున్నారు. విద్యుత్తు కోసం అదనంగా యూనిట్‌కు రూ.8 చొప్పున చెల్లిస్తున్నారు. గత ఆగస్టు నెలలో ఒక సంస్థ దీన్ని నెల రోజులకు రూ.8.26 లక్షలకు దక్కించుకుంది. విజయవాడకు వరదలు రావడంతో పెద్దగా గిరాకీ లేకుండా పోయింది. వారి గడువు ముగిసింది.

ఎవరికీ తెలియనీయకుండా..

దసరా సీజన్‌లో అద్దెకు ఇచ్చేందుకు మళ్లీ టెండర్ పిలిచారు. మ్యూజియం సిబ్బంది చిల్లర కోసం కక్కుర్తి పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ సమాచారం ఎవరికీ తెలియనివ్వలేదు. గుట్టుచప్పుడు కాకుండా సెప్టెంబరు 25న జారీ చేశారు. 26 నుంచి 29 వరకు టెండర్ల విక్రయం చేశారు. 30న సీల్డు టెండర్లను తెరిచారు. ఒకే ఒక్క టెండర్ పడింది. వారికి రూ.4.90లక్షలకు కట్టబెట్టారు. ఒక్క టెండర్ రావడం అనుమానాలకు తావిస్తోందని చెబుతున్నారు. గతంలో అధిక ధరకు టెండర్ దక్కించుకుని ప్రదర్శనలు ఏర్పాటు చేసి నష్టపోయిన నిర్వాహకులకు కనీసం సమాచారం ఇవ్వలేదు. ఐదారు సంస్థలు పాల్గొనేవి. అంతా రహస్యంగా నడిపించారు. వీటిని రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ వస్తోంది.

★ దీనిపై బాపూ మ్యూజియం ఉప సంచాలకుడు రాముసుబ్బారెడ్డిని వివరణ కోరగా తక్కువ ధర వచ్చిన విషయం వాస్తవమే అయినా.. తాము బహిరంగంగానే టెండర్ పిలిచామని చెప్పారు. రెండు టెండర్లు దాఖలయ్యాయని, ఇద్దరు మహిళలు పాల్గొన్నారని ఒకరికి ఇచ్చామని వివరించారు. తాము నోటీసు బోర్డులో పెట్టామని, ఎవరికీ ఫోన్లు చేసి చెప్పలేదంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

మచ్చా.. డ్యాన్స్ రచ్చ రచ్చ..!


యువతుల అభినయం


కేరింతలు కొడుతూ..

ఉత్సాహంగా యువజనోత్సవాలు




జానపద పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థులు


అమ్మవారి వేషధారణలో..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జిల్లా యువజనోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల విద్యార్థులు వివిధ రకాల నృత్యాలతో హోరెత్తించారు. వక్తృత్వ, ... ఆహూతులను అలరించారు. పోటాపోటీగా ప్రదర్శనలిస్తూ భళా అనిపించారు. కథలు రాయడం, పెయింటింగ్, వక్తృత్వం, హస్తకళలు తదితర పోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువతే కీలకం

విద్య, కళలు, క్రీడలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రతిభ చూపుతూ యువత దేశాభివృద్ధిలో భాగస్వాములై కీలక పాత్ర పోషించాలని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో, యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పూర్వకాలం నుంచి వస్తున్న కళలపై ఆసక్తి చూపాలని లక్ష్యంతో ఏటా యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నెహ్రూ యువకేంద్రం సమన్వయకర్త రాము మాట్లాడుతూ.. పోటీలు మనలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీస్తాయని, ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న కళల్లో రాణించాలని కోరారు. జాతీయ సేవా పథకం జిల్లా సమన్వయకర్త కె.రమేష్, పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ


ప్రవేశ పరీక్ష పోస్టర్ విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో వీసీ పార్థసారధి వర్మ, ప్రొఛాన్సలర్ జగన్నాథరావు తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: కేఎల్ విశ్వవిద్యాలయం విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష -2025 పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రొఛాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ప్రవేశ పరీక్ష విద్యావిధానం, మెరిట్ విద్యార్థులకు ఇచ్చే రాయితీలు, స్కాలర్‌షిప్, ప్లేస్‌మెంట్ తదితర అంశాలను వివరించారు. మొదట విడతలో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా పరీక్షలు ఉంటాయని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా మొదట విడత డిసెంబర్ 6 నుంచి 13 వరకు నిర్వహిస్తామని చెప్పారు.

మున్సిపల్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట పురపాలక సంఘంలో గుర్తించిన పలు అవకతవలకు సంబంధించి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఉన్నతాధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ధనంబోడులో చేపట్టిన పనులపై ఫిర్యాదులు రావడంతో నిర్వహించిన పరిశీలనా నివేదికను అనుసరించి ఏఈ హనుమంతరావు, డీఈఈ శివకోటేశ్వరరావు, ఈఈ డి.భూషణంలపై చర్యలకు సిఫార్సు చేశారు. దీంతో పాటు వీరిపై మరింత సమగ్రమైన విచారణకు కూడా ఆదేశించారు.

ముంపు సమస్య పరిష్కారానికి కృషి


సమావేశంలో ఎంపీ శివనాథ్, కలెక్టర్ సృజన, కమిషనర్ ధ్యాన్‌చంద్ర తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఇటీవల వరద ముంపుతో విజయవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన నేపథ్యంలో... రానున్న రోజుల్లో విపత్కర పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టరేట్‌లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఆర్డీవో కె.చైతన్య, దక్షిణ మధ్య రైల్వే, రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులతో రైల్వే, ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, ఎస్టేట్ తదితర అంశాలపై మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై కమిషనర్ ధ్యానచంద్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. డ్రెయిన్లలో పూడికతీత, పారిశుద్ధ్య పనులు, మ్యాన్‌హోళ్ల వద్ద చెత్త తొలగింపు, సుందరీకరణ, ఆర్‌యూబీల మంజూరు, నిర్మాణం, ఆక్రమణలు తదితర అంశాలపై చర్చించారు. వీఎంసీ, రైల్వే, జిల్లా అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎంపీ అన్నారు. స్టాండర్ట్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించి పనులు త్వరితగతిన చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశం అనంతరం ఎంపీ మాట్లాడుతూ... నాలుగు ప్రధాన డ్రెయిన్లపై దృష్టి సారించామని, విజయవాడ అర్బన్ పరిధిలో ఈ నెల 3, 4 తేదీల్లో, రూరల్ పరిధిలో ఈనెల 7, 8 తేదీల్లో సంబంధిత శాఖల అధికారులంతా కలిసి డ్రెయిన్ల స్థితిగతులు పరిశీస్తారని, తరువాత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైలవరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాయనపాడు, కొండపల్లి, ఈలప్రోలు తదితర ప్రాంతాల్లో ఆర్వోబీల అవసరాన్ని సమావేశం ముందుంచినట్లు చెప్పారు.

ఆటోలకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాల్సిందే



లెనిన్‌కూడలిలో ధర్నా చేస్తున్న కార్మికులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో మునిగిన ఆటోలకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం లెనిన్‌కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ.. బుడమేరు వరదతో నగరం విలవిలలాడిందని గుర్తు చేశారు. పది రోజుల పాటు వాహనాలన్నీ మునిగిపోయాయని చెప్పారు. నగరంలో 4వేల ఆటోలు పాడైపోయి కార్మికుల జీవితాలు అస్తవ్యస్తం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు పరిహారం సరిపోదని పేర్కొన్నారు. కార్మికులు రూ.40వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోయారు. వరద ముప్పును జాతీయవిపత్తుగా పరిగణించేందుకు మోదీ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని దుయ్యబట్టారు. కనీసం ఒక్క రూపాయి సహాయం ప్రకటించకపోవటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గూడేల జనార్దన్, నగర కార్యదర్శి కొట్టు రమణారావు, నాయకులు కె.వి.భాస్కరరావు, సంగుల పేరయ్య, మన్నెం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపండి'


ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న రవీంద్రనాథ్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం ధర్నా చౌక్‌లో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉక్కు పరిశ్రమను సెయిల్‌కు అప్పజెప్పడం ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్రంపై ఒత్తిడి చేసి, ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ లాభాల బాటలో ఉన్న కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పాటించడంతో పాటు ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఇప్పుడు మాట్లాడకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాము, రామన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూషణం, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు లంకా గోవిందరాజులు, డి.వి.కృష్ణ, దోనెపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, డి.అంజిరెడ్డి, ఉమామహేశ్వరరావు, కేశవరావు, కంచర్ల భార్గవ్, గోపీనాయక్, వెంకటేశ్వరరావు, కార్తిక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మృతదేహం లభ్యం

పటమట, న్యూస్‌టుడే: విజయవాడ స్క్యూబ్రిడ్జ్ సమీపంలోని బందరు కాలువలో ఆదివారం దూకిన వివాహిత తిరుపతి సుధారాణి మృతి చెందారు. ఆమె మృతదేహం మంగళవారం యనమలకుదురు లాకుల వద్ద దొరికింది. ఆమె కుమార్తె జాస్వి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మూడు రోజులుగా గాలిస్తున్నారు. సుధారాణి భర్త తిరుమలరావు మరో మహిళతో సన్నిహితంగా ఉండటమే దంపతుల మధ్య వివాదానికి కారణమైనట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆదివారం తల్లి తన ఇద్దరు కూతుళ్లతో బందరు కాలువలో దూకిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో చిన్న కుమార్తె బ్లేసి మృతి చెందింది. ఆమె మృతదేహం ఆదివారమే లభ్యమైంది. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తాజాగా తల్లి మృతదేహం దొరికింది. మరో చిన్నారి ఆచూకీ తెలియాల్సి ఉంది.

65,463 మిర్చి బస్తాల విక్రయం

గుంటూరు, (మిర్చియార్డు): మిర్చియార్డుకు రైతులు మంగళవారం 63,626 బస్తాలు తరలించారు. గత నిల్వలతో కలిపి 65,463 బస్తాల అమ్మకాలు జరిగాయి. మిర్చి సీజన్ ముగిశాక అన్‌సీజన్‌లో అధికంగా సరకు విక్రయం జరగడం ఇదే ప్రథమం. క్రయవిక్రయాలు ముగిసే సమయానికి యార్డులో 25,489 బస్తాలు నిల్వ ఉన్నాయి. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-16,800, నాన్ ఏసీ స్పెషల్ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-18,700, తాలు మిర్చికి రూ.5,000-12,000 ధర లభించింది.

ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు

వీరులపాడు, న్యూస్‌టుడే : తమ కుమారుడికి, తమకు... ఇద్దరి నుంచి ప్రాణహాని ఉందని, వారిపై చర్యలు తీసుకోవాలని వీరులపాడుకు చెందిన సుంకర జ్యోతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జి.అనిల్, బాధితుడి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సుంకర జ్యోతి దంపతుల చిన్న కుమారుడు నాగ శేషు తెదేపా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. ఐటీడీపీలో పని చేస్తున్నారు. గ్రామంలో మంగళవారం పంపిణీ చేసిన పింఛన్ల ఫొటోలను స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. వాటిని చూసిన అదే గ్రామానికి చెందిన పెరుమాళ్లపల్లి రవి కుమార్, పెరుమాళ్లపల్లి సురేష్ (పరిశుద్ధ)... నాగశేషుకు ఫోన్ చేశారు. 'గ్రూపుల్లో ఏంటి నీ హడావుడి. అంత గొప్ప వాడివా, ఎక్కువ చెయ్యకు' అంటూ బెదిరించారు. 'అది నా ఇష్టం. గ్రూపు అడ్మిన్‌లకు ఇబ్బందైతే వాళ్లే నన్ను గ్రూపు నుంచి తీసేస్తారు. మీకెందుకు' అని నాగశేషు బదులిచ్చారు. అంతటితో ఆ ఇద్దరు ఆగకుండా.. నాగ శేషు తల్లిదండ్రులు ఇంట్లో ఉండగా, కర్రలతో వెళ్లి 'మీ అబ్బాయి ఎక్కడ?, వాడి అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. తనను బెదిరించిన వ్యక్తులు వైకాపా వర్గీయులుగా నాగశేషు తెలిపారు. ఈ మేరకు నాగశేషు తల్లి జ్యోతి ఆ ఇద్దరి నుంచి తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 595 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ఇసుక క్వారీలు తెరిపించాలి



నిరసన కార్యక్రమంలో రామకృష్ణ, రమణ, మీరావలి తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఇసుక క్వారీలను వెంటనే తెరిపించి, అందరికీ అందుబాటులో ఉంచాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ కోరారు. మంగళవారం గాంధీనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మంది కార్మికులు ఈ రంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం అమ్మిన ధర కంటే.. ఇప్పుడు అదనంగా రూ.రెండు వేలు పెరిగిందన్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. దాని ఊసెత్తకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా జిల్లాల్లో ఇసుక రీచ్‌లు తెరవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి.రమణ, నాయకులు షేక్ మీరావలి, షేక్ బాజి, కనకారావు, సుబ్బారావు, కాళీ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హోం, రక్షణ శాఖల పార్లమెంటరీ కమిటీల్లో చోటు

కృష్ణలంక, న్యూస్‌టుడే: పార్లమెంటరీ స్థాయీ సంఘాలను పునర్ వ్యవస్థీకరిస్తూ 24 కొత్త కమిటీలను ఏర్పాటు చేసినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ పి.సి మోడీ ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయవాడ లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ హోం శాఖ, రక్షణ శాఖ కమిటీల్లో సభ్యుడిగా నియమితులైనట్లు గెజిట్ ద్వారా తెలియజేశారు.

30లోగా ఏపీ జీఎన్ఏ ఎన్నికల ప్రక్రియ పూర్తి

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ (ఏపీ జీఎన్ఏ) ఎన్నికల ప్రక్రియ ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ జీఎన్ఏ ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కోఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న తనకు ఏపీ జీఎన్ఏ ఎన్నికల నిర్వహణ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ కమిషనర్ నుంచి తాజాగా మార్గదర్శకాలు అందినట్లు తెలిపారు. అసోసియేషన్ బైలాస్, ఏపీసీఎస్(ఆర్వోఎస్ఏ) నిబంధనలు-2001 ప్రకారం ఉమ్మడి కృష్ణా జిల్లా ఓటర్ల జాబితాతో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



కట్టుబడిపాలెంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు



గొల్లపూడి: పింఛనుదారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని

తిరువూరు

• తిరువూరు • మైలవరం

10 మద్యం దుకాణాల కేటాయింపు

మైలవరం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ మైలవరం సర్కిల్ పరిధిలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాలకు సంబంధించి మొత్తం 10 మద్యం దుకాణాలను కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. మైలవరం, జి.కొండూరు మండలాలకు 4 చొప్పున, రెడ్డిగూడెం మండలానికి 2 దుకాణాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. 2011 జనాభా ప్రాతిపదికన మైలవరం, జి.కొండూరు మండలాల్లో ఒక్కో దుకాణానికి వార్షిక ఫీజు రూ.65 లక్షల చొప్పున, రెడ్డిగూడెం మండలంలో ఒక్కో దుకాణానికి రూ.రూ.55లక్షల ఫీజుగా ప్రభుత్వం ఖరారు చేసినట్లు వివరించారు. మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఈ నెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్ లేదా తమ కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. 11వ తేదీన ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో లాటరీ నిర్వహిస్తారని వివరించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

న్యూస్‌టుడే బృందం : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కట్టుబడిపాలెంలో స్థానిక నాయకులతో కలిసి ఫింఛను పంపిణీలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం సీఎం చంద్రబాబుకే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక సుగాలీకాలనీలో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.



తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి ఆధ్వర్యంలో..

పశుదాణా పంపిణీ



వరద ముంపునకు గురైన ఈలప్రోలు పాడిరైతులకు తానా ఆధ్వర్యంలో మంగళవారం పశుదాణా అందించారు..

- న్యూస్‌టుడే, ఈలప్రోలు(కొండపల్లి)

మేటేసిన ఇసుక.. కన్నీళ్లే ఇక

వరద ధాటికి వరి పొలాలు నాశనం

కొండపల్లి, న్యూస్‌టుడే

పచ్చని పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు, కౌలుదారులు గగ్గోలు పెడుతున్నారు. గత నెల ఒకటిన బుడమేరు కట్టలు తెగి వరద, బురద నీటితో ఊళ్లు, పొలాలు మునిగిపోవడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. ఈ విపత్కర పరిస్థితులకు మునేరు, బుడమేరు దిగువ భాగాన ఉన్న రైతులతో పాటు గతంలో ఎన్నడూ చూడని విపత్తును విజయవాడ ప్రజలు అనుభవించారు. అలాంటి గడ్డు పరిస్థితులను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోవడంతో పాటు నష్టపోయిన రైతులకు, ప్రజలకు సాయమందించింది. రైతులకు ఎకరాకు గరిష్ఠంగా రూ.10వేల వరకూ పంట పరిహారం అందించి ఆదుకుంది.

దిక్కుతోచని స్థితిలో..

ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఇసుక రూపంలో వచ్చిన బుసకతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంట కోసం చేసిన అప్పుల నుంచి బయట పడేందుకు ప్రభుత్వం సాయం అందించినా పొలాల్లో పేరుకుపోయిన ఇసుక తరలించేందుకు ఎన్ని కష్టాలు ఎదుర్కోవాలోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద రూపంలో వచ్చిన ఇసుక పూర్తిగా తొలగించి దుక్కితే గానీ పొలాల్లో సాధారణ స్థితికి రావు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని ప్రభుత్వ పెద్దలు ఆలోచించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కర్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కవులూరు వద్ద బుడమేరు కింద పొలాల దుస్థితి (పాత చిత్రం)

ప్రభుత్వమే సాయం చేయాలి

కొండపల్లి శాంతినగర్‌లో నాలుగు ఎకరాలు కౌలు కింద సాగు చేస్తున్నాను. మా రైతుకు ఇంకా పరిహారం అందలేదన్నారు. అయితే నాలుగు ఎకరాల్లో ఇసుక మేట వేసింది. దీనిని తొలగించడానికి జేసీబీలు అడిగితే గంటకు 1,400 తీసుకుంటామన్నారు. నాలుగు ఎకరాల్లో ఇసుక తొలగించడానికి 16 గంటలు పడుతుందన్నారు. ఆ తొలగింపు పనులు చేయిస్తే ఈ సంవత్సరం నాకు పూర్తిగా నష్టం వస్తుంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కొండయ్య, కౌలు రైతు, శాంతినగర్

ఆందోళనగా ఉంది

బుడమేరు వరద ధాటికి ఆరు ఎకరాల పంట నాశనమైంది. అందుకు ప్రభుత్వం సాయమందించింది. అయితే ఇసుక మేట వేసిన చేలల్లో ఇప్పుడల్లా సాగు చేసే పరిస్థితి కనిపించడంలేదు. ఇసుక దిబ్బలు తొలగించాలంటే ఎంత ఖర్చు అవుతుందోనని ఆందోళనగా ఉంది.

- జి.శ్రీను, రైతు, కవులూరు

నూతన కార్యవర్గం ఎన్నిక

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మైలవరంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్‌కే ఖాజారహంతుల్లా, కార్యదర్శి ఎస్‌కే ఖాసింషరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. జి.కొండూరు మండలశాఖ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎస్‌కే కొండబాబు నియమించినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాబు ప్రకటనలో తెలియజేశారు.

యూటీఎఫ్..

ఎ.కొండూరు: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య మంగళవారం తెలిపారు. అధ్యక్షుడిగా బీవీ.దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఇస్సాక్, గౌరవాధ్యక్షుడిగా బి.శ్రీరాములు, సహాధ్యక్షుడిగా ఎ.రవీంద్రబాబు, సహాధ్యక్షురాలిగా బి.కృష్ణకుమారి, కోశాధికారిగా ఎస్.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

ఏకనామ స్మరణ పూజల్లో జనసైనికులు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మంగళవారం మండలంలోని తుమ్మలపాలెం గ్రామ కోదండ రామాలయంలో జనసైనికులు నారాయణ ఏకనామ స్మరణ పూజలు నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన కార్యదర్శి చింతల లక్ష్మీకుమారి, నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? గొల్లపూడిలోని పలు వీధుల్లోని రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది.

- అశోక్, స్థానికుడు

✔ రహదారులను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

- స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, గొల్లపూడి

స్పందనకు వందనం

- తిరువూరు 12, 14వ వార్డు కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి మురుగు ప్రవహించడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. కార్మికులతో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయించారు.
- తిరువూరు 16వ వార్డు తంగెళ్లబీడులో రహదారికి ఒక వైపు నుంచి మరోవైపునకు నీరు ప్రవహించడానికి వీలైన కుండ ఉండని కాలనీవాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు చేసిన ఫిర్యాదుపై ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ చర్యలు చేపట్టారు. సిమెంట్ తూరలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు.

- న్యూస్‌టుడే, తిరువూరు

గ్రామాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం విద్యుత్తు సెక్షన్ కార్యాలయానికి చెందిన మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, మండల పరిషత్తు పాఠశాలలు, గ్రామ సచివాలయాలకు తొలిసారిగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. మండల పరిధిలో మొత్తం 170 మీటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్తుశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకన్న తెలిపారు. మొదటి దశలో సింగిల్ ఫేజ్ సర్వీసులున్న కార్యాలయాల్లో మార్చామన్నారు. రెండో దశలో త్రీ ఫేజ్ మీటర్లు మారుస్తామన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వీటి ఏర్పాటును ఆయన వివరిస్తూ ఈ మీటర్లకు ముందుగానే రీఛార్జి చేసుకోవాలని ఈ మేరకు కార్యాలయాధికారులు ముందస్తుగా విద్యుత్తు ఛార్జీలకు సంబంధించిన బడ్జెట్‌ను మంజూరు చేయించుకోవాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కాచవరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఉపాధ్యాయులు పిచ్చి మొక్కలు తొలగించారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు భవాని, ఇర్ఫాన్ పాషాలు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇల్లా రవి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో పరిసరాల్లో విద్యార్థులు చెత్త తొలగించారు. ఉప ప్రిన్సిపల్ రంగారావు, ప్రోగ్రాం అధికారులు ఫణికుమార్, మన్నేస్వామి తదితరులు పాల్గొన్నారు.



కాచవరం పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

'ఎమ్మెల్యే కొలికపూడి క్షమాపణ చెప్పాలి'

తిరువూరు: తాను ఎన్నికలకు ముందు కాలువల పూడికలు తీయించి రైతులకు మేలు చేస్తే ఈ రోజు సమావేశానికి ఒక్కరూ రాలేదని.. శునకాలకు ఉన్న విశ్వాసం వారికి లేదని సోమవారం తెదేపా కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు రైతులను ఉద్దేశించి మాట్లాడారని తక్షణం ఆయన క్షమాపణలు చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు టి.కృష్ణయ్య, ఎం.డేవిడ్, ఎన్.వనమాలి డిమాండ్ చేశారు. సుంకర వీరభద్రరావు భవన్‌లో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ☛ తెదేపా కార్యకర్తల సమావేశానికి రైతులు రాకపోతే పరుష పదజాలంతో మాట్లాడిన ఎమ్మెల్యేపై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పి.శ్రీనివాసరావు, యు.లక్ష్మీదాసు డిమాండ్ చేశారు.

ముందస్తు దసరా సంబరాలు

తిరువూరు, వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: స్థానిక శ్రీనిధి ఉన్నత పాఠశాలలో, వినగడప ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా సంబరాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు అమ్మవార్ల వేషధారణలు ధరించి ఆకర్షణగా నిలిచారు.



అమ్మవార్ల వేషధారణలతో విద్యార్థినులు

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండండి

తిరువూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టిసారించి ఉన్నతిని చేరుకోవాలని జేఎఫ్‌సీఎం కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్ సూచించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు స్థానిక బీసీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వసతిగృహంలోని వసతులు, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి సమావేశంలో మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



అల్పాహారం పరిశీలిస్తున్న న్యాయమూర్తి మోతీలాల్

మండల స్థాయి చెకుముకి పోటీలు

ఇబ్రహీంపట్నం : సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జవివే చేస్తున్న ప్రయత్నం ఆహ్వానించదగినదని ఎంపీడీవో రామకృష్ణనాయక్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు మండల స్థాయి పోటీలు ఇబ్రహీంపట్నం జాకీర్‌హుస్సేన్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.

మైలవరం: చెకుముకి సైన్సు ప్రతిభా పోటీల్లో స్థానిక ఆక్స్‌ఫర్డ్, గౌతమ్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ముగ్గురు చొప్పున విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు టాలెంట్ టెస్ట్ కన్వీనర్ గొల్లపూడి సురేష్ తెలిపారు.

పెదకొమిర(గంపలగూడెం), న్యూస్‌టుడే: పెదకొమిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు.



పెదకొమిర జూనియర్ కళాశాలలో..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: చెకుముకి ప్రతిభా పరీక్షల్లో గీతాంజలి, శ్రీనారాయణ, మద్దులపర్వ ఆదర్శ పాఠశాల, కూనపరాజుపర్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల జట్లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జవివే జిల్లా కమిటీ సభ్యుడు జి.మల్లికార్జునరెడ్డి తెలిపారు.

తిరువూరు, న్యూస్‌టుడే: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జవివే ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్సు పోటీలు నిర్వహించారు.

కార్మికుల సేవలు మరువలేం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కొవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో, ఇటీవల సంభవించిన వరద సమయంలో పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు మరువలేనివని తెదేపా విజయవాడ పార్లమెంట్ మహిళా కార్యదర్శి అంతెం ఉదయలక్ష్మి కొనియాడారు. స్థానిక సచివాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యదర్శి వై.బసవలింగేశ్వరరావు, సర్పంచి మండల అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు

క్లాప్ మిత్ర సిబ్బందికి సన్మానం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా క్లాప్ మిత్ర సిబ్బందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచి కవిత, కార్యదర్శి మునేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో రెడ్డిగూడెం ఈవోపీఆర్డీ బొమ్మసాని శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో మండలంలో పనిచేస్తున్న 22 మంది గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు అందజేసి సన్మానించారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి, ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై సూచనలు

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: వరి పంటకు అక్టోబరు మాసం అత్యంత కీలకమైందని జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకురాలు టి.మాధవీలత తెలిపారు. ఈ నెలలోనే ఆ పంటలో చీడపీడల వ్యాప్తి ఉద్ధృతంగా ఉంటుందని, అన్నదాతలు అప్రమత్తంగా ఉంటూ పంటను వాటి బారి నుంచి కాపాడుకోవాలని సూచించారు. మండలంలోని కోడూరులో మంగళవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి వరిలో చిరుపొట్ట దశలో, పత్తిలో పూత, కాయ దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. ఏడీఏ జి.కెనడీ, ఏవో ఎస్‌కే.టిప్పుసుల్తాన్, హెచ్‌వో బి.నరేంద్ర, సర్పంచి సురేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చివరికి అందని సాగర్‌జలాలు

ఆయకట్టులో పంటలు ఎండుముఖం

గంపలగూడెం, న్యూస్‌టుడే

ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు విడుదల చేసిన సాగర్‌జలాలు గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలోని మేజర్ కాల్వలకు సరఫరా చేయడం లేదు. మధిర శాఖ కాల్వకు కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి గత శుక్రవారం సాగర్‌జలాలు విడుదల చేస్తున్నారు. తొలిరోజు మాత్రమే గంపలగూడెం సెక్షన్ పరిధిలోని మేజర్ కాల్వలకు కొంత నీరు చేరింది. తదుపరి మూడు రోజుల నుంచి మధిర శాఖ కాల్వకు విడుదల చేస్తున్న సాగర్‌జలాలను ఎగువన ఉన్న కల్లూరు సెక్షన్ పరిధిలోని పంటలకు తెలంగాణ అధికారులు వినియోగిస్తున్నారు. దీంతో గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలోని పెదకొమిర, గంపలగూడెం, నిదానపురం, మధిర, ఊటుకూరు, ఆర్లపాడు, లింగాల మేజర్లకు నీటి సరఫరా లేదు. ఫలితంగా కాల్వల ఆయకట్టులో వరి, మిరప, పత్తి తదితర పంటలకు సాగు నీటి కొరత ఏర్పడింది. చివరి భూములకు నీటి సరఫరా లేక సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

దిగువ భూముల రైతుల్లో నైరాశ్యం

మధిర బ్రాంచి కెనాల్‌లో 23వ కి.మీ దిగువన ఏపీ పరిధిలోని రైతులకు చెందిన 25వేల ఎకరాలకు సాగర్‌జలాలు సరఫరా చేయాల్సి ఉంది. నెల రోజుల తర్వాత కాల్వకు సాగు నీరు విడుదల చేయగా దిగువకు చేరక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కల్లూరు సెక్షన్ పరిధిలో మేజర్లతో పాటు గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలోని ఆరు మేజర్లకు కూడా కాల్వల సామర్థ్యం మేరకు సాగర్‌జలాలు సరఫరా చేయాల్సి ఉంది. మండుతున్న ఎండలకు నీటి తడులు అందక సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ఎగువన కాల్వల్లో సాగర్‌జలాలు ప్రవహిస్తున్నా దిగువన పంటలకు చేరడం లేదని, పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీటి సరఫరా లేని కాల్వ

విడుదల ఇలా..

మధిర బ్రాంచి కెనాల్ సామర్థ్యం 1,500 క్యూసెక్కులు. గరిష్ఠంగా 1,300 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తారు. కప్పల బంధం నియంత్రిక నుంచి ఈ నెల 27న 727, 28న 838, 29న 763, 30న 801 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. 23వ కి.మీ దిగువకు ఈ నెల 27న 294, 28న 160, 29న 131, 30న 79 క్యూసెక్కుల చొప్పున వచ్చాయి.

తెలంగాణ అధికారులతో మాట్లాడాను

మధిర బ్రాంచి కెనాల్‌లో 23వ కి.మీ దిగువన గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలో మేజర్లకు సాగర్‌జలాల సరఫరాపై తెలంగాణ అధికారులతో సోమవారం మాట్లాడాను. ఇక్కడి పంటలకు సాగు నీటి కొరత ఉందని, తక్షణ నీటి తడులు అందించకపోతే ఎండిపోయే ప్రమాదం ఉందని వివరించాను. కాల్వ సామర్థ్యం మేరకు మధిర శాఖ కాల్వకు సాగర్‌జలాలు విడుదల చేయాలని కోరాను.

- రామ్‌దాస్, ఎన్ఎస్పీ తిరువూరు సబ్‌డివిజన్ డీఈ

అవీ ఇవీ

పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈడా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

భగవద్గీత పుస్తకాల వితరణ

మైలవరం: తితిదే, హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల వితరణ చేపట్టారు. మంగళవారం ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ.సుధాకరరావు కార్యాలయంలో పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులకు వాటిని అందజేశారు.

ఇసుక తరలించేందుకు అనుమతులివ్వండి

తిరువూరు: మండల పరిధిలోని వాగుల్లో ఇసుక తరలించడానికి అనుమతివ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు స్థానిక కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

మైలవరం: కూటమి ప్రభుత్వ లక్ష్యమైన స్వర్ణాంధ్ర -2047 గోడ పత్రికలను మంగళవారం మండలంలోని కీర్తిరాయునిగూడెంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు డి.రాము, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డి.విజయ్‌కుమార్ ఆవిష్కరించారు.

విద్యార్థులకు పోటీలు

మైలవరం: వీరగాథ 4.0 కార్యక్రమంలో భాగంగా స్థానిక 6వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పద్యాల తోరణం, చిత్రలేఖనం, దేశభక్తి గేయాలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

జిల్లా స్థాయికి ఎంపిక

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను, గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలల బాలబాలికలు అండర్-14, అండర్-17 కబడ్డీ, డిస్క్ త్రో, వాలీబాల్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో జిల్లా జట్లకు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు ఎం.క్రిస్టోఫర్, బి.కిరణ్‌కుమార్, పీడీలు హెచ్.అంజయ్య, బి.రాంబాబు మంగళవారం తెలిపారు.

కంభంపాడు(ఎ.కొండూరు) : మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ ఆటల పోటీల్లో అండర్-14, అండర్-17 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో విభాగాల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం, ఆదిశేషు, పీడీ గోపి తెలిపారు.

మాకు పరిహారం అందలేదు

జి.కొండూరు : మండలంలోని గడ్డమణుగు ఎస్సీ ప్రాంతంలోని వరద బాధితులైన దళితులు 40 మంది తమకు నష్ట పరిహారం అందలేదంటూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వినతి పత్రం సమర్పించి ఆదుకోవాలని కోరారు.

ప్రకటన

నా క్లయింటు యన్.టి.ఆర్ జిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రారు యిలాకా పరిధిలోని మైలవరం మండలం, మైలవరం గ్రామ కాపురస్తురాలు షేక్ అహమ్మద్ భాషా గారి భార్య తాహెరున్నీసా గారి సంజాయిషీ పొంది ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు ది.22-11-2011వ తేదీన కొండపల్లి గ్రామ కాపురస్తులు ఖాదర్ భేగ్, S/o.లేటు ఉస్మాన్ భేగ్‌గారి నుండి ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని కొనుగోలుచేసి ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో డాక్యుమెంటు నెం. 5131/2011గా రిజిస్ట్రీ పొందియున్నారు. శ్రీ ఖాదర్ భేగ్ గారు సదరు ఆస్తిని ది.24-6-1999వ తేదీన వారి తల్లిగారైన నజీమున్నీసా భేగం, చెల్లెలు బద్రున్నీసా భేగం గారల వద్ద నుండి 2/3వ వంతు అనిర్ధిష్టపు జాయింటు హక్కుగల ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని దఖలు పొంది ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో డాక్యుమెంటు నెం.1632/1999గా రిజిస్ట్రీ పొంది అనుభవిస్తూ నా క్లయింటుకు ది.22-11-2011వ తేదీన అమ్మియున్నారు. వాస్తవంగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఖాదర్ బేగ్‌కు తాత గారైన దావుద్ భేగ్‌గారు ది.6-1-1928వ తేదీన కొనుగోలు చేసి Doc No.31/1928గా విజయవాడ SROలో రిజిస్ట్రీ చేసియున్నారు. దర్మిలా వారు అనుభవిస్తూ పరమపదించియున్నారు. ఆ దర్మిలా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఖాదర్ భేగ్ తండ్రి గారైన ఉస్మాన్ భేగ్ మరియు వీరి సోదరులు పూర్వార్జితంగా అనుభవిస్తూ, మూజువాణీ వాటాల ప్రకారం పంచుకొనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి ఉస్మాన్ భేగ్ గారికి రాబడి, వారు అనుభవిస్తూ మరణించగా సదరు ఆస్తి వారి ముఖ్యవారసులైన నజీమున్నీసా భేగం, బద్రున్నీసా భేగం మరియు ఖాదర్ భేగ్ గారలకు సంక్రమించియుండగా, వారిలో నజీమున్నీసా భేగం, బద్రున్నీసా భేగంలు వారికి సంబంధించిన 2/3వ వంతు అనిర్ధిష్టపు, అవిభాజ్యపు హక్కును ఖాదర్ భేగ్ గారికి దఖలు పరచి, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో డాక్యుమెంటు నెం.1632/1999గా సంక్రమింపచేయగా, సదరు ఖాదర్ బేగ్‌గారు నా క్లయింటుకు విక్రయించి డాక్యుమెంటు నెం.5131/2011గా రిజిస్ట్రీ చేసియున్నారు. సదరు ఆస్తి 1928వ సం॥లోని స్థిరాస్తి అయి వారసత్వంగా రాబడి మూజువాణీగా పంచుకొనియున్నందున రిజిష్టరు పార్టీషన్లు గానీ, మరణ ధృవపత్రములు గానీ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్ గానీ లేవు గాన నా క్లయింటుకు ఇచ్చియుండలేదు. కానీ వాస్తవంగా సదరు ఆస్తి పూర్వార్జితమైయున్నందున నా క్లయింటు తన కుమారుడైన షేక్ మహమ్మద్ గౌస్ జానీగారి విద్యాభ్యాసం నిమిత్తం మైలవరం కెనరా బ్యాంక్ నందు ఎడ్యుకేషన్ లోన్‌ను ఈ దిగువ తెలిపిన ఆస్తిని తనఖా వుంచుటకు అంగీకరించియున్నారు. కావున సదరు ఆస్తిపై ఎవరికైనను ఏమైనను ఆక్షేపణలు, అభ్యంతరములు వున్నయెడల ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలోపు ఈ దిగువ చిరునామాదారుకు లిఖితపూర్వకంగా తెలుపగలందులకు కోరడమైనది. అటుల రానియెడల దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నా క్లయింటు యొక్క నిష్పేచి అయిన స్థిరాస్తిగా భావించవలసియుండును. ఆ దర్మిలా వచ్చు అభ్యంతరములు పరిగణనలోకి తీసుకోబడవు.

షెడ్యూలు: ప్రస్తుత యన్.టి.ఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన కొండపల్లి గ్రామ రెవిన్యూ లెక్కల దాఖలా కొండపల్లి గ్రామ ఆర్.యస్ నెం. 438/1 దాఖలా 95.96 చ॥గ॥ల నివేశన స్థలము అందుగల కొత్త డోర్ నెం.5-50 (సరికొత్త డోర్ నెం.1-5-47) దాఖలా బెంగుళూరు పెంకుటిల్లు వగైరాలకు **హద్దులు: తూర్పు:** మొహిద్దీన్ భేగ్ గారి ఆస్తి, **దక్షిణం:** ఉదయగిరి సూర్యప్రకాశరావు సోదరుల ఆస్తి, **పడమర:** సామల నాగేశ్వరరావు గారి ఆస్తి, **ఉత్తరం:** ఖిల్లాకు వెళ్ళు పంచాయతీ బజారు

ఇట్లు : K.V.R.N. ముత్య ప్రసాద్, M.Com., B.L
Advocate & Notary

శ్రీమతి P. శశికళ, అడ్వకేట్
Tiruvuru - 521 235. Cell No: 98855 74113.

తిరువూరు
ది. 02-10-2024

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందనకు వందనం

★ ఏలూరు రోడ్డు మాచవరం పేరయ్య మెస్ ఎదురుగా డ్రైనేజీ మురుగునీరు బయటకు వస్తోందని స్థానిక నివాసి నరేంద్ర ఏఈ నాగేశ్వర రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పూడిక తీయించారు.

★ నాలుగో డివిజన్ వెంకటేశ్వరనగర్ మూడో రోడ్డులో 4-16/111 నుంచి నాలుగు స్తంభాల దీపాలు గత కొంత కాలంగా వెలగడం లేదని టి.సత్యనారాయణ ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు.

? 5వ డివిజన్ క్రీస్తురాజపురం అరుళ్ నగర్ వద్ద సైడు కాలువల్లో పూడిక తొలగించడం లేదు. **- రవి కుమార్**

✔ చెత్త తొలగిస్తాం **- కె. వెంకటేశ్వరరావు, శానిటరీ అధికారి**

– న్యూస్‌టుడే, కరెన్సీనగర్

జగన్మాత దుర్గమ్మకు వెండి గిన్నెల వితరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: జగన్మాత దుర్గమ్మకు మల్లికార్జునపేటకు చెందిన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సోదరి కాండ్రేగుల జగదీశ్వరి 1.270 కిలోల బరువు ఉన్న వెండి తీర్థపు గిన్నెలను మంగళవారం విరాళంగా అందజేశారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని వీటిని మొక్కు రూపంలో చెల్లించినట్లు దాత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈవో రామారావు దాత కుటుంబానికి విరాళం రసీదు అందజేశారు.

డ్రెయిన్ కుదింపు ఎప్పుడో?

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

పంట కాలువ డ్రెయిన్‌కు మోక్షం లభించడం లేదు. కాలువ కుదింపు పనులు మొదలు పెడుతున్నామని అధికార పక్షం చెప్పి 80 రోజులైనా ఎటువంటి కదలిక లేదు. పంట కాలువ వెడల్పు తగ్గించి బాయన బాబూజీ రహదారిని వెడల్పు చేయాలని ప్రజలు కోరుతున్నా కాలయాపన చేస్తున్నారు. వాహనాల రద్దీ అధికమైంది. ప్రస్తుత రహదారి సరిపోవడం లేదు. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. వెంటనే పనులు మొదలు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.


వ్యర్థాలతో నిండిన పంట కాలువ డ్రెయిన్

రూ.7 కోట్లు వచ్చినా..

✷ పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మూడు అడుగుల వెడల్పుతో మొదలయ్యే పంట కాలువ సీటీవో కాలనీకి వచ్చే సరికి ఆరు అడుగులు, మహానాడు రోడ్డుకు వచ్చే సరికి 15 అడుగులు, కరెన్సీనగర్ బల్లెం వారి వీధికి వచ్చే సరికి 22 అడుగుల మేర ఉంటుంది.

✷ కరెన్సీనగర్, శ్రీరామచంద్రనగర్, కనకదుర్గానగర్ ప్రాంతాల్లో రోడ్డు కుదించి డ్రెయిన్ వెడల్పు చేయడాన్ని కాలనీవాసులు గతంలో వ్యతిరేకించారు. డ్రెయిన్‌ని కుదిస్తామని చెప్పిన వైకాపా పాలకులు బల్లెం వారి వీధి నుంచి హైటెన్షన్ రోడ్డు వరకు బాయన బాబూజీ రోడ్డుని కుదించి, అందులోనే ఫుట్‌పాత్ ఏర్పాటు చేసి గుత్తేదారుల జేబులు నింపారు. ఈ రోడ్డు పొడవునా డ్రెయిన్ కుదించాలని కాలనీల కమిటీలు కోరుతున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ✷ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహానాడు రోడ్డుకు ఇరువైపులా వర్షం డ్రెయిన్ నిర్మించాలని, పంట కాలువ డ్రెయిన్ కుదించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శాసనసభ్యుడు రామ్మోహన్ చొరవ తీసుకొని రూ.7 కోట్లు మంజూరు చేయించారు. మూడు నెలల వ్యవధిలో టెండర్లు పిలిచి ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ అధికారులు మాత్రం ప్రస్తుతం మంజూరైన నిధులకు అదనంగా నిధులు జోడించి మరికొన్ని నిర్మాణాలు పూర్తి చేయాలని భావిస్తున్నారు. మళ్లీ ప్రతిపాదనలు పెంచారు. ఆ మేరకు ఇంకా నిధులు మంజూరు కాలేదు.

వరదల వల్ల ఆలస్యం

కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.7 కోట్ల కేంద్రం నిధులు వచ్చాయి. ప్రతిపాదనలు సిద్ధం చేయమన్నారు. పనులు గతంలో వర్షాకాల డ్రెయిన్లను అసంపూర్తిగా వదిలేసిన ఎల్ అండ్‌టీ సంస్థకు అప్పగించాలన్న ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉంది. వరదలు రావడంతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన పనులు మొదలు పెడతాం. – సామ్రాజ్యం, ఈఈ సర్కిల్-3

పింఛను సొమ్ము పెంపు ఘనత తెదేపాదే

కృష్ణలంక, న్యూస్‌టుడే: పింఛన్ల గురించి మాట్లాడే హక్కు తెదేపాకు మాత్రమే ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గతంలో ఎన్టీఆర్ రూ.35 పింఛను ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబునాయుడు రూ.4 వేలు ఇంటి వద్దే ఇప్పిస్తున్నారని చెప్పారు. కృష్ణలంక 21వ డివిజన్‌లో మంగళవారం ఎమ్మెల్యే పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెదేపా అధికారంలోకి వచ్చిన తరువాతే పింఛన్ల పథకం మొదలైందని గుర్తు చేశారు. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని జగన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను ఇప్పించలేదని, వారి ఖాతాల్లో వేసి, సచివాలయాలకు రప్పించి ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. 42 మంది మృతికి కారణమయ్యారని ఆరోపించారు. జగన్ మాదిరిగా ఏడాదికి రూ.250 కాకుండా.. ఒకే సారి రూ.1000 పింఛను పెంచిన ఘనత తెదేపాకు దక్కుతుందన్నారు.

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : మొగల్రాజపురం, లబ్బీపేట ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. చంద్రరాజేశ్వరరావు నగర్‌లో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కర్రి రాజేష్ సిబ్బందితో కలిసి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.


కృష్ణలంక, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకటో తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తున్నట్లు తెదేపా 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. డివిజన్ పరిధిలో మంగళవారం పార్టీ నేతలతో ఇంటింటికి వెళ్లి పింఛన్లను అందించారు. సచివాలయ కార్యదర్శులు, నాయకులు బలగాని శ్రీను, అంబటి కాశీ, పి.వెంకటేశ్వరరెడ్డి, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి చంద్రబాబు కృషి


మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే రామ్మోహన్ తదితరులు

కృష్ణలంక, విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సీఎం చంద్రబాబు కార్యాచరణ రూపొందించారని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కృష్ణలంక ఏపీఎస్పీ రెమ్ ప్రాంగణంలోని క్రీడా వికాస కేంద్రాన్ని, పాఠశాల మైదానాన్ని మంగళవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. క్రికెట్ శిక్షణ తీసుకుంటున్న చిన్నారులను పలకరించారు. వాకర్స్‌తో మాట్లాడారు. మైదానం అభివృద్ధికి సూచనలు, సలహాలు తీసుకున్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ మాట్లాడుతూ... ఇక్కడ దాతలు అందించిన ఏడు ఎకరాల మైదానం ఉన్నందున... క్రికెట్ స్టేడియంగా అభివృద్ధి చేసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఎంపీ శివనాథ్ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నందున.. ఆయన సహకారంతో మైదానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్, క్రీడా సంఘాలతో చర్చించి అంచనాలు రూపొందిస్తామని వెల్లడించారు. శాప్ మాజీ ఛైర్మన్ అంకమ్మ చౌదరి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, వాకర్స్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న గంగాధర్‌రెడ్డి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : పేదలు ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్‌కు ఆపన్నహస్తం ఛైర్మన్, ఏపీ జెన్‌కో డిప్యూటీ ఇంజినీర్ డాక్టర్ ఉలవపల్లి గంగాధర్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందించారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను మంగళవారం కలిసి చెక్కు అందజేశారు.

క్యూలైన్లలో భక్తులకు తాగునీరు అందించండి


అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, న్యూస్‌టుడే : క్యూలైన్లలో వెళ్లే భక్తులకు తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటిని అందించేందుకు 25 పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ క్యూలైన్లలో నీటిని అందించాలని సూచించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల్లో ఏ విధమైన లోపాలు తలెత్తకుండా చూడాలని కోరారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆరు ప్రాంతాల్లో ఉచిత క్లాక్ రూంలు, చెప్పుల స్టాండ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చీఫ్ మెడికల్ అధికారి పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, పలువురు అధికారులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న కృష్ణప్రసన్న, అక్కయ్యనాయుడు, చదలవాడ నాగేశ్వరరావు తదితరులు

3 నుంచి దేవి శరన్నవరాత్రులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విజయవాడ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఈ నెల 3 నుంచి 12 వరకు దేవి శరన్నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ సుంకర అక్కయ్యనాయుడు, ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల వేదిక వద్ద మంగళవారం ఆహ్వాన ప్రతులు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దసరా మహోత్సవాల్లో భాగంగా రోజూ శతచండీ హోమం, శాంతి కల్యాణం, కుంకుమార్చన, సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, దశవిధ హారతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు హాజరు కావాలని కోరారు. కమిటీ ప్రధాన కార్యదర్శి వైట్ల కృష్ణప్రసన్న, రాళ్లపల్లి పవన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లి హారిక, చారుగుండ్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


బ్రోచర్ విడుదల చేస్తున్న కాళీమాత ఆలయ కమిటీ సభ్యులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: బస్‌స్టేషన్ సమీపంలోని త్రిశక్తిపీఠం కాళీ మాత ఆలయంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్‌కుమార్ తెలియజేశారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులతో కలిసి వారు వేడుకల బ్రోచర్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... 3న కలశ స్థాపనతో వేడుకలకు అంకురార్పణ చేస్తామని చెప్పారు. సుప్రభాత సేవ, అభిషేకాలు, శ్రీచక్రార్చన, వేదపారాయణ, కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు. ఏడున అమ్మవార్లకు పరిక్రమణోత్సవం, 9న చిన్నారులకు అక్షరాభ్యాసం, 11న పూర్ణాహుతి, 13న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించి అన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయకిరణ్, అర్చకులు శిష్ట్లా దుర్గాప్రసాద్, జె.సీతారామాంజనేయులు, సీహెచ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శివనాథ్‌ను కలిసిన మాగుంట



పటమట, న్యూస్‌టుడే: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి తీసుకురావాల్సిన నిధుల గురించి చర్చించారు.

వరద బాధితులకు భరోసా


ఉద్యోగులకు గృహోపకరణాలు అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన ఉద్యోగులకు శ్రీరామ్ సంస్థ వివిధ రూపాల్లో సాయం అందించి అండగా నిలిచిందని ఆ సంస్థ దక్షిణ ప్రాంతీయ విభాగం ఫైనాన్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. వరదల వల్ల నష్టపోయిన 75 మంది ఉద్యోగులకు శ్రీరామ్ సంస్థ అందించిన రూ.50 లక్షల విలువైన వస్తువులను పటమటలోని త్యాగరాజన్ భవన్‌లో మంగళవారం పంపిణీ చేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, ఉన్నత ఉద్యోగులు నాగేంద్ర, మొగిలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సహవాసం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ప్రజలు రాకపోకలు కొనసాగించే రహదార్లను అధికారులు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. మురుగు కాలువలు, కల్వర్టులను సైతం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడో డివిజన్ ఐజాక్ వీధిలోని రహదారిని ఏళ్ల కిందట నిర్మించారు. ప్రస్తుతం అది పూర్తిగా దెబ్బతింది. పగుళ్లు ఇచ్చింది. రాకపోకలకు అసౌకర్యంగా మారింది. అదే రహదారిలో వేపచెట్టు ఉన్న చోట రోడ్డు నెర్రలిచ్చింది. దారి అనువుగా లేక అదుపు తప్పి ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. ఎన్నికల ముందు వైకాపా నాయకులు, ప్రజాప్రతినిధులు వచ్చి హడావుడిగా రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి తర్వాత పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. సుదర్శన్‌వీధిలో మురుగు కాలువపై సిమెంట్ దిమ్మెలు వేశారు. అందులో ఒకటి కుంగిపోయింది. వాహనదారులు రాత్రి పడిపోయి గాయాలపాలవుతున్నారని స్థానికులు వాపోయారు. కల్వర్టు నిర్మించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా దిమ్మెలు


ఐజాక్ వీధిలో నెర్రలిచ్చిన రహదారి

శంకుస్థాపన చేసి వదిలేశారు



ఎన్నికల ముందు హడావుడిగా నాయకులు, ప్రజాప్రతినిధులు వచ్చి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నిస్తే కోడ్ అని సాకు చూపించారు. కొత్త ప్రభుత్వం వచ్చి మూడు నెలలు పూర్తయింది. ఇంకా రహదారి పనులు ప్రారంభించలేదు. మురుగు కాలువలు కూడా పాడైపోయాయి. వాటిని అభివృద్ధి చేయాలి. కాలువపై వేసిన సిమెంట్ దిమ్మెలు ఎగుడుదిగుడుగా ఉండి కదులుతున్నాయి. ద్విచక్రవాహనదారులు పడిపోతున్నారు. సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి. **-కె.రామయ్య, స్థానికుడు**

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పండగలు, రానున్న వివాహాల సందర్భంగా విజయవాడ ఎంజీ రోడ్డు మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీలోని ఎ ప్లస్ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే వెడ్డింగ్ పాపప్ షాప్ ప్రదర్శనను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అంజలి, భవ్య మాట్లాడుతూ.. బంగారం, డైమండ్, చీరలు, డ్రెస్సెస్, ఫ్యాషన్ యాక్సెసరీస్‌తో పాటు ఒక గ్రాము జ్యూయలరీ ఉత్పత్తులను 75కి పైగా స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రదర్శన బుధవారం రాత్రి 8 గంటల వరకు మాత్రమే ఉంటుందని, ప్రజలు సందర్శించాలని కోరారు.


స్టాల్స్ వద్ద సందర్శకులు

నగరంలో 'హై లైఫ్' ప్రదర్శన


ఆభరణాలతో మోడళ్లు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: దేశంలోనే ప్రసిద్ధిగాంచిన 'హై లైఫ్' ప్రదర్శన, అమ్మకాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విజయవాడ నోవోటెల్ హోటల్‌లో ప్రారంభించిన ప్రదర్శనలో దేశంలోనే ప్రసిద్ధిగాంచిన వివిధ రాష్ట్రాల వస్త్రాలతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. హై లైఫ్ ఎగ్జిబిషన్ ఎండీ, సీఈవో అబి పి డొమినిక్ మాట్లాడుతూ.. వెడ్డింగ్ ఫ్యాషన్స్, జ్యువెలరీ, బ్రైడల్ ఫ్యాషన్‌తో పాటు లైఫ్ స్టైల్ ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. వధువు మెచ్చే అధునాతన డ్రెస్‌లు, వెడ్డింగ్ చీరలు, డిజైనర్ అప్రెరల్, బ్రైడల్ ఆభరణాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రదర్శన ఎక్స్‌క్లూజివ్‌గా యువత, మహిళలు మెచ్చేవిధంగా ఉందని, నాణ్యమైన డ్రస్సులు, చీరలు, ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రదర్శన బుధవారం కూడా ఉంటుందని, నగర ప్రజలు సందర్శించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరెడ్డి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : మంగళగిరిలో మంగళవారం జరిగిన ప్రజాదర్బార్‌కు బాపట్ల జిల్లా చీరాల మండలం బుగ్గలవారి పాలెం గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. వరుసలో నిలబడిన ఆయన పురుగుల మందు తాగడాన్ని అక్కడ ఉన్న వారు గమనించారు. వెంటనే అతన్ని 108లో వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన వెంకటేశ్వరరెడ్డిని ఐసీయూలో ఉంచి వైద్యులు వైద్య సేవలందిస్తున్నారు.

క్రీడావని

రాష్ట్ర అడ్వకేట్స్ క్రికెట్ జట్టు సారథిగా క్రాంతికుమార్



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: లక్నోలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు దూబా క్రాంతికుమార్ (విజయవాడ) సారథ్యం వహిస్తారని రాష్ట్ర అడ్వకేట్స్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు పొన్నేరు సురేష్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. ఈ టోర్నీలో 16 హైకోర్టు అడ్వకేట్స్ క్రికెట్ జట్లు తలపడతాయని పేర్కొన్నారు.

విద్యార్థినులకు అభినందన


విద్యార్థినులతో ప్రిన్సిపల్ ఎస్.పద్మజ, శిక్షకులు

విజయవాడ క్రీడలు: ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ తైక్వాండో, సాఫ్ట్ టెన్నిస్ జట్లకు ఎంపికైన విద్యార్థినులను మంగళవారం ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.పద్మజ తన కార్యాలయంలో అభినందించారు. సీహెచ్ ఉష, డి.మేఘన, ఎ.రిషితరెడ్డి, ఎస్.భవిష్య, యోచిత, పి.సిరి, పి.బిందు గంగాభవ్యశ్రీ, ఎం.సిరివల్లి జిల్లా తైక్వాండో జట్టులో స్థానం సాధించగా.. ఎన్.నిషాంత్, జె.అనన్య, పి.సిరి, ఎల్.సరన్య, ఎస్.లీలామృత సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

సీబీఎస్ఈ టీటీ పోటీలకు ఎంపిక


అభిరామ్‌ని అభినందిస్తున్న కోటేశ్వరరావు, శ్రీదేవి, శ్రీనివాస్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని డాక్టర్ కేకేఆర్స్ ఇంటర్నేషనల్ హ్యాపీ వాలీ స్కూల్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు ఎ.అభిరామ్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి అండర్-17 బాలుర విభాగంలో జాతీయ సీబీఎస్ఈ టీటీ పోటీలకు అర్హత సాధించాడని ప్రిన్సిపల్ కె.శ్రీదేవి తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం కంగర జిల్లాలోని రెయిన్‌బో ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అభిరామ్, కోచ్ బి.శ్రీనివాస్‌ను డాక్టర్ కేకేఆర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ కె.కోటేశ్వరరావు అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు


ఎంపికైన క్రీడాకారులతో శివప్రసాద్, శిక్షకులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఈ నెల 4 నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు గూడవల్లిలోని డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు అర్హత సాధించారని ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల నగరంలోని పీవీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎం.రుత్విక్ (పెంటాథ్లాన్), కె.రాగమయూరి (600 మీటర్ల పరుగు) ప్రతిభ ప్రదర్శించి జట్టులో స్థానం సాధించారని పేర్కొన్నారు. మంగళవారం క్రీడాకారులను, కోచ్‌లను విద్యాసంస్థల ఛైర్మన్ కె.కోటేశ్వరరావు, డైరెక్టర్లు అభినందించారు.

3 నుంచి క్రికెట్ టోర్నీ


విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల(పీజీ)ను ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాలలో నిర్వహిస్తామని వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. 15 జట్లు ఈ టోర్నీలో తలపడతాయని ఆయన పేర్కొన్నారు.

వారాహి సభ జయప్రదానికి పిలుపు


మాట్లాడుతున్న సామినేని ఉదయభాను, పక్కన అమ్మిశెట్టి వాసు తదితరులు

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జనసేన పార్టీ ఆశా కిరణంలా ఎదుగుతుందని మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత సామినేని ఉదయభాను అన్నారు. మంగళవారం పటమటలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అనానరు. ఉప ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేకూర్చేలా పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో డ్రైనేజీలు శుభ్రం చేయడానికి కూడా పంచాయతీల వద్ద నిధులు ఉండేవి కాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీలను పవన్ కల్యాణ్ బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. 9 వేల గ్రామ సభలు ఒకే రోజు ఏర్పాటు చేసి రికార్డు సృష్టించారన్నారు. పవన్ ప్రాయశ్చిత్త దీక్ష ఒక మతానికి సంబంధించింది కాదని స్పష్టం చేశారు. ఈ నెల 3న తిరుపతి నిర్వహించే వారాహి సభకు రాష్ట్ర వ్యాప్తంగా జనసైనికులు తరలిరావాలని సూచించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, నాయకులు గాదిరెడ్డి అమ్ములు, బాడిత శంకర్, కొప్పిరెడ్డి ఎస్.ఎన్.మూర్తి, బోడపాటి శివదత్ తదితరులు పాల్గొన్నారు.

'మేకింగ్ ఆఫ్ మహాత్మా' చిత్ర ప్రదర్శన


విద్యార్థులతో ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోల ఇంజినీరింగ్ కళాశాలలో సొసైటీ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ కల్చర్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ జయంతి నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు 'మేకింగ్ ఆఫ్ మహాత్మా గాంధీ' సినిమాను కళాశాల థియేటర్‌లో చూపించారు. విద్యార్థులకు దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయడానికి, వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని కళాశాల డైరెక్టర్ జోజి రెడ్డి అన్నారు. ప్రిన్సిపల్ మహేష్, క్యాండీ డికొజా, ఎక్స్‌టెన్షన్ కో-ఆర్డినేటర్ ఎ.రాజేష్ పర్యవేక్షించారు. అట్కిన్‌సన్, డాన్‌బాస్కో, సిద్ధార్థ, మారిస్ స్టెల్లా, మడోన్నా, విజయమేరీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు కేర్ సెంటర్లు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నగరంలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌లు, కేర్ సెంటర్లు పెట్టేలా నగర పాలక సంస్థలో ప్రతిపాదన పెడతానని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం గవర్నర్‌పేటలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పింఛనును రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు మాట్లాడుతూ.. వృద్ధుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భారత్ పథకం ప్రవేశపెట్టిందని.. అందరూ నమోదు చేసుకోవాలని కోరారు. వృద్ధుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనాభాలో 60 శాతం ఉన్న వృద్ధుల కోసం ప్రత్యేకశాఖ లేకపోవడం బాధకరమన్నారు. 101 ఏళ్ల అడుసుమిల్లి వెంకాయమ్మతో పాటు 75 ఏళ్లు పైబడిన 13 మంది వృద్ధులను సత్కరించారు.

నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

వారాహి సభ జయప్రదానికి పిలుపు

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జనసేన పార్టీ ఆశా కిరణంలా ఎదుగుతుందని మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత సామినేని ఉదయభాను అన్నారు. మంగళవారం పటమటలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అనానరు. ఉప ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేకూర్చేలా పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో డ్రైనేజీలు శుభ్రం చేయడానికి కూడా పంచాయతీల వద్ద నిధులు ఉండేవి కాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీలను పవన్ కల్యాణ్ బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. 9 వేల గ్రామ సభలు ఒకే రోజు ఏర్పాటు చేసి రికార్డు సృష్టించారన్నారు. పవన్ ప్రాయశ్చిత్త దీక్ష ఒక మతానికి సంబంధించింది కాదని స్పష్టం చేశారు. ఈ నెల 3న తిరుపతి నిర్వహించే వారాహి సభకు రాష్ట్ర వ్యాప్తంగా జనసైనికులు తరలి రావాలని సూచించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, నాయకులు గాదిరెడ్డి అమ్ములు, బాడిత శంకర్, కొప్పిరెడ్డి ఎస్. ఎన్.మూర్తి, బోడపాటి శివదత్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

✦ కొణతమాత్మకూరు సచివాలయం వద్ద బోరుకు మంగళవారం మరమ్మతులు చేశారు. ఈ నెల 1న 'ఈనాడు'లో 'గొంతుతడపని బోరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ మరమ్మతులు చేయించారు.

✦ లింగాలపాడు శివాలయం వీధిలో డ్రెయిన్లు పూడుకుపోయాయని స్థానికులు పంచాయతీ కార్యదర్శి సీతారామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కార్మికులతో పూడిక తీయించారు.

✦ కొణతమాత్మకూరులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఎల్‌ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. – న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

✦ పెనుగంచిప్రోలు యాదవపల్లెలో డ్రెయిన్లలో పూడిక తీయాలని స్థానికులు సర్పంచి వేల్పుల పద్మకుమారి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కార్మికులను పంపించి పూడిక తీయించారు.

✦ తుపాన్‌కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆ ప్రాంతవాసులు పంచాయతీ కార్యదర్శి శ్యాం కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ట్యాంకర్లు పంపించి తాగునీటి సరఫరా చేశారు.

✦ అనిగండ్లపాడులో ముత్యాలమ్మ ఆలయ సమీపంలో వ్యర్థాలు తొలగించాలని స్థానికులు సర్పంచి బి.జ్యోతి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కార్మికులను పంపించి పనులు చేయించారు.

✦ ముండ్లపాడులో కొత్తఊరు ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని ఆ ప్రాంత ప్రజలు సర్పంచి గూడపాటి లావణ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరించారు. – న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

రూ.50 వేల విరాళం అందజేత

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవాలయానికి విజయవాడ రూరల్ గొల్లపూడికి చెందిన ఆలపాటి సాంబశివరావు, జయలక్ష్మీ దంపతులు మంగళవారం రూ.50 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. ఖమ్మం నగరం మామిళ్లగూడెంకు చెందిన మద్దుకూరి శ్వేతచౌదరి రూ.15,116 విరాళంగా అందజేశారు. దాతలను సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

వృద్ధుల సంరక్షణ చట్టాన్ని వినియోగించుకోండి


మాట్లాడుతున్న న్యాయమూర్తి రేష్మ

మాగల్లు(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: వృద్ధుల సంరక్షణ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని నందిగామ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ రేష్మ కోరారు. మంగళవారం మాగల్లు ఖాసిం వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. 2007లో వృద్ధుల సంరక్షణకు చట్టాలు చేశారని చెప్పారు. కేకు కోసి పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబూవిద్యాసాగర్, సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు, ఆశ్రమ నిర్వాహకుడు షేక్ కరీముల్లా, న్యాయవాదులు పాల్గొన్నారు.

కాలువ నీరందక... ఎత్తిపోతల పనిచేయక

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే


మూతపడిన మాగల్లు-2 పథకం పంప్‌హౌస్

నిర్వహణ లేక ఎత్తిపోతల పథకాలు మూత పడ్డాయి. ఆయకట్టు పొలాలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల కాలంలో పథకాలను పట్టించుకోలేదు. కనీసం లీకులకు మరమ్మతులు కూడా చేయించలేదు. ఫలితంగా ప్రస్తుతం వైరా ఏటిలో నీరున్నా.. అన్నదాతలకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. మోటార్లు పని చేయక పథకాలు నిరుపయోగంగా మారాయి.

నిర్వహణ కరవు

సోమవరం వద్ద వైరా ఏటి ఒడ్డున మాగల్లు-2 ఎత్తిపోతల నిర్మించారు. దాని పరిధిలో సోమవరం, రుద్రవరం, తొర్రగుడిపాడు, మాగల్లు గ్రామాలకు చెందిన 240 ఎకరాల ఆయకట్టు ఉంది. నాలుగు మోటార్లతో నీటిని ఎత్తిపోసి పైపులైన్ ద్వారా పంటలకు సరఫరా చేయాలి. ఈ ఎత్తిపోతలలో విద్యుత్తు తీగలు ధ్వంసమయ్యాయి. మోటార్ల ద్వారా నీటి విడుదలకు వీలు పడటం లేదు. మునేటి ప్రధాన కాలువకు గండ్లు పడటంతో ప్రస్తుతం సాగునీరు అందడం లేదు. ఖరీఫ్‌లో రైతులు పత్తి, మొక్కజొన్న, వరి, మిర్చి తదితర పంటలు సాగు చేస్తున్నారు. మునేటి కాలువ నీరందక, ఎత్తిపోతల పనిచేయక పంటలు ఎండుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఎత్తిపోతలకు నూతన రైతు కమిటీ ఏర్పాటు చేసి సక్రమంగా సాగునీరు అందించాలని ప్రజాప్రతినిధులను రైతులు కోరుతున్నారు.

★ వైరా ఏటిఒడ్డున నిర్మించిన కమ్మవారిపాలెం ఎత్తిపోతల కూడా మూలకు చేరింది. గతేడాది వరదకు ఇన్‌టేక్ వెల్‌లో ఇసుక పూడుకుపోయింది. ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగను దొంగలు ఎత్తుకెళ్లారు. దీని ఆయకట్టులో 200 ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఎత్తిపోతల ద్వారా నీరు రాకపోవడంతో రైతులు విద్యుత్తు మోటార్లతో పంటలు పండిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

దీనిపై ఐడీసీ ఏఈ జి.రవికృష్ణ వివరణ కోరగా.. ప్రస్తుతం మాగల్లు-2 ఎత్తిపోతల ద్వారా నీరు విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యుత్తు తీగలకు మరమ్మతులు చేయిస్తామని అన్నారు. రైతు కమిటీ ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని వివరించారు.

పింఛన్ల పంపిణీ


వైవై కాలనీలో నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్లను పూర్తిస్థాయిలో పంచాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చేయడానికి అధికారులతోపాటు నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా మంగళవారం పంపిణీ ప్రక్రియలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పట్టణంలోని 1వ వార్డు వైవై కాలనీ తదితర ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. రాష్ట్ర తెదేపా అంగన్‌వాడీ విభాగం ఛైర్మన్ ఆచంట సునీత పలు ప్రాంతాల్లో పంపిణీలో పాల్గొన్నారు. ఆయా వార్డుల్లోని కౌన్సిలర్లు, నాయకులు సచివాలయం సిబ్బందితో పాటు వెళ్లారు.

3న ప్రజా దర్బార్

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: చిల్లకల్లు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 3న ఉదయం 10 గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భోజనం ప్లేట్ల పంపిణీ

కంచికచర్ల, న్యూస్‌టుడే: జనసేన నాయకుడు దేవిరెడ్డి శ్రీనివాసరావు తన కుమారుడు దత్తశ్రీ మనోజ్ పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక ప్రణీత కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్లు అందజేశారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కేకు పంపిణీ చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

చందర్లపాడు: తుర్లపాడులోని బొడ్రాయి సెంటరులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిమజ్జనం చేశారు. విగ్రహాన్ని వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వాగతం పలికి కానుకలు సమర్పించారు.

పింఛను సొమ్ము పెంపు చంద్రబాబు ఘనతే


నందిగామ: లబ్ధిదారుకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ, నందిగామ గ్రామీణం, వీరులపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. నందిగామ 15, 16 వార్డుల్లో ఎమ్మెల్యే సౌమ్య పింఛన్లు అందజేశారు. పింఛను సొమ్ము పెంపు చంద్రబాబు ఘనత అని అన్నారు. కమిషనర్ రమణబాబు, తహసీల్దారు నూతక్కి సురేష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శాఖమూరు స్వర్ణలత, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

★ నందిగామలో 4249 మంది లబ్ధిదారులకుగాను మంగళవారం 4006 మందికి పింఛన్లు అందజేశారు. పురపాలక ఫ్లోర్‌లీడర్ శాఖమూరు స్వర్ణలత పాల్గొన్నారు.

★ పాతకంచలలో తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.

★ వీరులపాడు మండలం కొణతాలపల్లిలో తెదేపా మండల అధ్యక్షుడు కొంగ్రగుంట శ్రీనివాస కుమార్, చౌటపల్లిలో గురిజాల అజయ్ కుమార్, జయంతిలో చీదిరాల భరత్ రెడ్డి, గువ్వల సత్యనారాయణ, చెన్నారావుపాలెంలో కోడెల కుటుంబరావు, యర్రగుంట కృష్ణారావు, జుజ్జూరులో కాపా రాంబాబు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.


పరుగు పందేనికి సిద్ధంగా బాలికలు


ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రమేష్‌పవారీ

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. 200 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక చేశారు. పోటీలను ఎస్‌జీఎఫ్ పోటీల నియోజకవర్గ కోఆర్డినేటర్ పల్లపు శ్రీనివాసరావు ప్రారంభించారు. విజేతలను ఎంఈవో-2 ఎం.పద్మ, ప్రధానోపాధ్యాయిని పి.విజయలక్ష్మి అభినందించారు. పోటీల కోఆర్డినేటర్లు కె.కల్యాణరాజు, బి.వెంకటేశ్వరరావు, ఎన్.ప్రసాద్, ఎస్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభచూపిన నందిగామ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపల్ రమేష్‌పవారీ అభినందించారు. అండర్-14.. 1500 మీటర్ల పరుగులో ఎ.దేవాంజలి ద్వితీయ, 600 మీటర్ల పరుగులో వై.విష్ణువర్ధన్ తృతీయ, షాట్‌పుట్‌లో ఆర్.అభిలాష్ ద్వితీయ, షేక్ రిమ్‌షా, వై.విష్ణువర్ధన్ తృతీయ స్థానాలు సాధించారు. అండర్-17 షాట్‌పుట్‌లో టి.అరవింద్ ద్వితీయ, ఎన్.అనూష ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు.


లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థి

జిల్లా స్థాయికి ఎంపిక

కంచికచర్ల, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో కంచికచర్ల మండలం గొట్టుముక్కల, మోగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. గొట్టుముక్కల ఉన్నత పాఠశాల నుంచి టి.హేమలత, టి.ఎలియేజర్, పి.నాగేశ్వరరావు, కె.జస్వంత్, డి.సందీప్, మోగులూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కె.ప్రేమ్ కుమార్, ఆయేషా, అర్షిమానాజ్, ఎండి.రేయాన్ ఎంపికైనట్లు తెలిపారు.

డివిజన్‌లో 33 మద్యం దుకాణాలు

నందిగామ: నందిగామ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో 33 మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. నందిగామ పట్టణంలో ఆరు, మండలంలో రెండు, కంచికచర్ల మండలంలో ఐదు, వీరులపాడు మండలంలో రెండు, పెనుగంచిప్రోలు మండలంలో ఐదు, చందర్లపాడు మండలంలో మూడు, జగ్గయ్యపేట పట్టణంలో 4, మండలంలో నాలుగు, వత్సవాయి మండలంలో రెండు దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీ లోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేయవచ్చని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట అబ్కారీ స్టేషన్లల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.

బీఎస్పీ నాయకులపై అక్రమ కేసులు అమానుషం

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా మదనపల్లిలో బీఎస్పీ చేపట్టిన నిరసన ప్రదర్శన అడ్డుకుని నాయకులను అరెస్టు చేయడం అమానుషమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పుష్పరాజ్ మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. నందిగామలో నిరసన ప్రదర్శన అడ్డుకోవడమే కాకుండా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్, నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. దీనికి కారకులైన వారిపై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేవైసీకి నేడూ అవకాశం

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట సబ్‌డివిజన్‌లోని మూడు మండలాల్లో ఈ పంట నమోదు చేసుకున్న రైతులు తమ వివరాలను ధ్రువీకరించుకునే కేవైసీ ప్రక్రియను బుధవారం లోగా పూర్తి చేసుకోవాలని ఏడీఏ భవాని తెలిపారు. ఇప్పటికే వచ్చిన అర్జీల పరిశీలనలో భాగంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ

జగ్గయ్యపేట గ్రామీణం: జగ్గయ్యపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.గురవయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఆయన పిఠాపురం నుంచి జగ్గయ్యపేటకు వచ్చారు. ఇప్పటి వరకు జగ్గయ్యపేటలో విధులు నిర్వర్తించిన ఎస్.మణికంఠరెడ్డి బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా తణుకు స్టేషన్‌కు వెళ్లారు.

గాంధీజీకి నివాళి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని చినమోగుదుపల్లి ఎంపీపీ పాఠశాలలో మంగళవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బతుకమ్మలు పేర్చి వేడుక చేశారు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుసు చోరీ

జగ్గయ్యపేట గ్రామీణం: అనుమంచిపల్లిలో పానుగంటి రత్తమ్మ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. చిల్లకల్లు ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఆమె నందిగామ వెళ్లడానికి రోడ్డులో వస్తుండగా.. కోదాడ వైపు నుంచి వస్తున్న కారులో నుంచి దిగిన వ్యక్తి మహిళ మెడలో 20 గ్రాముల గొలుసును దొంగిలించి పారిపోయాడన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


పాత కంచలలో బతుకమ్మను పూజిస్తున్న విద్యార్థినులు


మహిషాసురమర్దని అవతారంలో ...


ప్రత్యేక వేషధారణలో ఏకత్వ పాఠశాల విద్యార్థులు


జగ్గయ్యపేట: విజ్ఞాన్ పాఠశాలలో నృత్యాలు చేస్తూ..

ఉత్సాహంగా దసరా ముందస్తు వేడుకలు


గండ్రాయి పాఠశాలలో బతుకమ్మలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, వీరులపాడు, న్యూస్‌టుడే: దసరా నవరాత్రులను పురస్కరించుకొని కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని పలు పాఠశాలల్లో ముందస్తు వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. పండగ శోభ ఉట్టిపడేలా పాఠశాలల ఆవరణలను అలంకరించారు. ఏకత్వ పాఠశాలలో చిన్నారులు ప్రత్యేక వేషధారణలతో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ ఆడారు.

✦ పాతకంచల, చందాపురం ఎంపీయూపీ పాఠశాలల్లో దసరా సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలు రూపొందించారు. మహిషాసురమర్దని అవతారంలో అలరించారు. ప్రధానోపాధ్యాయిని శ్యామల, వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో గురువారం నుంచి దసరా శరన్నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. రోజువారి జరిగే పూజల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

జగ్గయ్యపేట గ్రామీణం: పట్టణం, గండ్రాయి, బలుసుపాడుల్లోని పలు విద్యాసంస్థల్లో, పాఠశాలల్లో ముందస్తు దసరా, బతుకమ్మ సంబరాలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలు తయారు చేసి పాటలకు నృత్యాలు చేశారు. పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి పాల్గొన్నారు.


అన్నవరం పాఠశాలలో సంబరాలు

'ఉపాధి దొరక్క ఇబ్బందులు'


ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కంచికచర్ల, వీరులపాడు, న్యూస్‌టుడే: వేలాది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు అన్నారు. భవన నిర్మాణ రంగం కార్మికుల సంఘం యూనియన్, ఇఫ్టూల పిలుపు మేరకు కంచికచర్ల, వీరులపాడు తహసీల్దారు కార్యాలయాల ఎదుట కార్మికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులే కూటమి ప్రభుత్వంలో కార్మికులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే ఇసుక క్వారీలు తెరిపించి కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని తహసీల్దారుకు అందజేశారు.

పాత విధానంలో ఇసుక అందించండి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఇసుక ఆన్‌లైన్ విధానంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడేలా ఉందని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనుమంచిపల్లి ఇసుక యార్డ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వాహనాలకు జీపీఎస్ విధానం, ఆన్‌లైన్ బుకింగ్ స్థానికులకు అవ్వడం లేదన్నారు. ఇసుకను పాత విధానంలో ట్రాక్టర్లకు లోడ్ చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్నారు. అనంతరం వారు తహసీల్దార్, ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. బిల్డింగ్ వర్కర్స్ సంఘ అధ్యక్షుడు నేలకంఠ శివప్రసాద్, అధ్యక్ష కార్యదర్శులు అంబోజీ శివాజీ, పోతుపాక వెంకటేశ్వర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం


బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన బాధితులకు డులాస్ ట్రస్ట్, చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ తరఫున నిత్యావసర సరకులు, కూరగాయలు పంపిణీ చేశారు. పట్టణంలో మంగళవారం 100 కుటుంబాలకు బియ్యం, దుప్పట్లు, కూరగాయలను డులాస్ అకాడమీ, గోల్డెన్ బడ్స్ విద్యార్థుల చేతులకు మీదుగా అందజేశారు. నిర్వాహకులు పగిడిపల్లి మణిశనంద్, దేవసహాయం, రత్నవినోద్, జ్ఞానకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల దినోత్సవం



ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎక్కువ కాలం సేవలను అందించిన 83 ఏళ్ల పిల్ల మత్తయ్య, తాళ్లూరి పెరుమాళ్లయ్యలను ప్రతినిధులు సత్కరించారు. సంఘ అధ్యక్షుడు చినమీరా, కార్యదర్శి నంబూరి చలపతిరావు, కోశాధికారి సీతారాం, సభ్యులు మోహనరావు, బాషా తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

'కార్మికులను తొలగించడం అన్యాయం'

నందిగామ, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు కొంత మందిని రాజకీయ కారణాలతో తొలగించడం అన్యాయమని జిల్లా మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ సుప్రజా విమర్శించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం రెండో రోజు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సుప్రజా మాట్లాడుతూ.. వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు కటారపు గోపాల్, వేల్పుల ఏసోబు, కళావతి, సత్యవతి, జాన్‌బీ, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: న్యాయవాదుల చట్టంలో బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా అభ్యంతరకరమైన మార్పులు చేయడాన్ని నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం విధులు బహిష్కరించారు. అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో వారు కోర్టు ఎదుట ప్రదర్శన చేసి బార్ కౌన్సిల్ చర్యలు న్యాయవాదులను కించపరిచేవిగా ఉన్నాయని ఆక్షేపించారు. కార్యక్రమంలో బి.వెంకట్రామయ్య, కె.నరసింహారావు, పి.సత్యశ్రీనివాస్, ఎం.కృష్ణయ్య, ఆర్.ప్రసాద్, జి.శ్రీనివాస్ గౌడ్, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ నెల మూడు, నాలుగో తేదీల్లోనూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబువిద్యాసాగర్ తెలిపారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

పేద మహిళ వైద్యానికి ఆర్థిక సాయం

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామకు చెందిన నిరుపేద మహిళ మిట్టపల్లి రాజ్యలక్ష్మి వైద్యానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల కింద పడటంతో ఆమె కాలు విరిగిపోయింది. వైద్య ఖర్చులకు ఇబ్బందికరంగా ఉండడంతో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ ఆరోగ్య సేవలో భాగంగా ఆమెకు రూ.26 వేలు ఆర్థిక సహాయం చేశారు. నాయకులు పారేపల్లి సాయిబాబు, చల్లా గాంధీ, పారేపల్లి చిన్నారి, వనమా బుల్లిబ్బాయి, నకిరికంటి నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

✦ నందిగామలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిరుపేద ఆర్యవైశ వృద్ధులకు మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన చల్లా వరలక్ష్మి జ్ఞాపకార్థం కుమారులు చల్లా సాయిరామ్, జనార్దనరావు, కుమార్తెలు ఆనంద్, పద్మప్రియల వితరణలో పది మందికి రూ.500 చొప్పున అందజేశారు. నాయకులు పారేపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన


మరమ్మతులు చేస్తున్న కార్మికులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తాగునీటి పథకం పైపులైన్‌కు మంగళవారం పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈనాడులో 'పగిలిన పైపులు.. తాగునీటి వెతలు' శీర్షికన మంగళవారం ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పనులు ముమ్మరంగా చేసి రెండు రోజుల్లో తాగునీటి సరఫరా పునరుద్ధరణ చేస్తామని పంచాయతీ కార్యదర్శి జి.శ్యాంకుమార్ తెలిపారు.

విజయవాడ పశ్చిమ

జగన్మాత దుర్గమ్మకు వెండి గిన్నెల వితరణ



ఇంద్రకీలాద్రి: జగన్మాత దుర్గమ్మకు మల్లికార్జునపేటకు చెందిన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సోదరి కాండ్రేగుల జగదీశ్వరి 1.270 కిలోల బరువు ఉన్న వెండి తీర్థపు గిన్నెలను మంగళవారం విరాళంగా అందజేశారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని వీటిని మొక్కు రూపంలో చెల్లించినట్లు దాత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈవో రామారావు దాత కుటుంబానికి విరాళం రసీదు అందజేశారు.

గాంధీజీ భావజాలం తెలియజేయడమే లక్ష్యం



గాంధీ నాగరాజన్ పోరాటం

భవానీపురం, న్యూస్‌టుడే : సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు, అవినీతి, అక్రమాలను రూపుమాపేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నారు గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వాహకుడు గాంధీ నాగరాజన్. నగరానికి చెందిన రామిశెట్టి రామచంద్రన్ నాగరాజన్ 2016లో గాంధీ దేశం ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 2 అక్టోబరు 2021న పూర్తి స్థాయిలో గాంధీ వేషధారణతో ఆయన మార్గంలో పయనిస్తున్నారు. దీంతో గాంధీనాగరాజన్‌గా పేరు మారింది. ఆనాటి నుంచి పాదయాత్ర, నిరాహార దీక్షలు, శాంతియుతంగా కార్యక్రమాలు, వివిధ సామాజిక అంశాలపై పోరాటాలు, కళ్లకు గంతలు కట్టుకుని నిరాహార దీక్ష చేస్తున్నారు. భవానీపురం ఊర్మిళానగర్‌లో గాంధీ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, మద్యం నిషేధించాలని, ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందించాలని, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, ఇలా... అనేక విధాలుగా పోరాటాలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలోను డబ్బులు తీసుకుని ఓటు వేయద్దంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాంధీనాగరాజన్ మాట్లాడుతూ ప్రజల్లో మార్పు తీసుకువచ్చేందుకు, వారికి గాంధీ భావజాలం తెలియజేయడమే తన ప్రయత్నమని పేర్కొన్నారు. మూడేళ్లుగా ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

మహాత్ముడు అడుగు పెట్టిన కొండ..!

గాంధీ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

చిట్టినగర్, న్యూస్‌టుడే

బ్రిటీషు పాలనా కాలంలో విజయవాడ రైల్వేస్టేషన్ పడమర భాగంలో ఉన్న పర్వతానికి కోటి రూపాయలు 'స్వరాజ్యనిధి' సేకరించడంలో భాగంగా 20 లక్షల నూలు వడికే రాట్నాల పంపకం కార్యక్రమానికి ఈ పర్వతం వేదిక అయ్యింది. జాతీయ ఉద్యమ స్ఫూర్తిగా తొలిసారిగా గాంధీజీ రావడంతో ఆ పర్వతానికి గాంధీకొండగా నామకరణం చేశారు. దాన్ని వల్లభనేని మల్లికార్జునరావు అనే వ్యక్తి లీజుకు తీసుకున్నట్లు చరిత్ర చెబుతుంది. తర్వాత ఆయన దగ్గర నుంచి గాంధీ స్మారక ట్రస్టు ఆ కొండను తీసుకుంది.



గాంధీ పర్వత స్తూపం



నక్షత్రశాల ఇదే..



కుర్చీలు సిద్ధం చేస్తూ..

జాతీయ పతాకాన్ని రూపొందించిన ఘట్టాలు

1921లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సదస్సుకు మహాత్మా గాంధీ హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని పింగళి వెంకయ్య రూపొందించిన ఘట్టాలు ఇక్కడ జరిగాయి. దీంతో గాంధీ స్మారక ట్రస్టు 500 అడుగుల ఎత్తులో పర్వత ఉపరితల భాగాన ఈ కొండపై 52 అడుగుల గాంధీ స్మారక స్తూపాన్ని దుర్గి గ్రామ శిల్పుల సహకారంతో గాంధీ నిలువెత్తు చిహ్నంతో నందలాల్ బోస్ స్తూప నిర్మాణ రూపకల్పన చేశారు. దీనికి గుంటూరు జిల్లా రెంటచింతల నుంచి తీసుకొచ్చిన రెడ్‌మార్బుల్‌తో నిర్మించారు.

గాంధీ స్మారక గ్రంథాలయం ఏర్పాటు

పరిశోధనాలయం ప్రారంభించి గాంధీ సాహిత్యాన్ని, ఆయన చరిత్ర వంటి గ్రంథాలను అందరికి అందుబాటులో ఉంచారు. ఆయన జీవిత విశేషాలను తదితర అంశాలను వినిపించాలనే ఉద్దేశంతో ధ్వని ప్రకాశం దర్శనం ఏర్పాటు చేశారు. దీన్ని 1969 డిసెంబరు 22న సరిహద్దు గాంధీ ప్రారంభించారు. అనంతరం ప్రముఖ ఇంజినీర్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కేఎల్‌రావు కృషి ఫలితంగా నక్షత్రశాలను నిర్మించి అప్పటి ఉప రాష్ట్రపతి జీఎస్.పథక్ చేతుల మీదుగా ఆరంభించారు. కాలక్రమేణ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో నక్షత్రశాల, ధ్వని ప్రకాశ దర్శనం, స్మారక గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ భవనాన్ని తొలగించారు. నగర ప్రజల నుంచి గాంధీ పర్వత సందర్శనానికి ఆదరణ తగ్గింది.

నక్షత్రశాల ప్రారంభానికి సన్నాహాలు

అక్టోబరు 2న గాంధీ జయంతి కావడంతో నక్షత్రశాలను తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు గాంధీ కొండ మేనేజర్ బేగ్ తెలిపారు. దాని చుట్టూ పెరిగిన పిచ్చి చెట్లు నగరపాలక సంస్థ ఉద్యాన, పారిశుద్ధ్యం విభాగం సిబ్బంది తొలగించి పరిశుభ్రం చేస్తున్నట్లు చెప్పారు. గాంధీ జయంతిని నిర్వహించేందుకు కొండపై స్తూపం వద్ద షామియానా, కుర్చీలు, సోఫాసెట్లు, విద్యుత్తు దీపాలంకరణ వంటివి ఏర్పాట్లు చేస్తున్నారు.

క్యూలైన్లలో భక్తులకు తాగునీరు అందించండి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, న్యూస్‌టుడే : క్యూలైన్లలో వెళ్లే భక్తులకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు తాగునీటిని అందించేందుకు 25 పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ క్యూలైన్లలో నీటిని అందించాలని సూచించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల్లో ఏ విధమైన లోపాలు తలెత్తకుండా చూడాలని కోరారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆరు ప్రాంతాల్లో ఉచిత క్లాక్ రూంలు, చెప్పుల స్టాండ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చీఫ్ మెడికల్ అధికారి పి.రత్నావళి, సిటీ ప్లానర్ జీ.వి.జి.ఎస్.వి.ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు ఇవ్వాలి



పింఛను పంపిణీ చేస్తున్న సత్యబాబు

చిట్టినగర్, న్యూస్‌టుడే : అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా పింఛన్లు రాకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం రకరకాల కారణాలు చూపి పింఛన్లు రద్దు చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్లు ఇస్తుందని ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలిందన్నారు. రద్దు చేసిన పింఛన్లు, కొత్తగా అర్హత ఉన్న వారికి వెంటనే పింఛన్లు ఇవ్వాలని కోరారు.

వారాహి సభ జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జనసేన పార్టీ ఆశా కిరణంలా ఎదుగుతుందని మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత సామినేని ఉదయభాను అన్నారు. మంగళవారం పటమటలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అనానరు. ఉప ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేకూర్చేలా పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో డ్రైనేజీలు శుభ్రం చేయడానికి కూడా పంచాయతీల వద్ద నిధులు ఉండేవి కాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీలను పవన్ కల్యాణ్ బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. 9 వేల గ్రామ సభలు ఒకే రోజు ఏర్పాటు చేసి రికార్డు సృష్టించారన్నారు. పవన్ ప్రాయశ్చిత్త దీక్ష ఒక మతానికి సంబంధించింది కాదని స్పష్టం చేశారు. ఈ నెల 3న తిరుపతిలో నిర్వహించే వారాహి సభకు రాష్ట్ర వ్యాప్తంగా జనసైనికులు తరలిరావాలని సూచించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, నాయకులు గాదిరెడ్డి అమ్ములు, బాడిత శంకర్, కొప్పిరెడ్డి ఎస్.ఎన్.మూర్తి, బోడపాటి శివదత్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : పేదలు ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్‌కు ఆపన్నహస్తం ఛైర్మన్, ఏపీ జెన్‌కో డిప్యూటీ ఇంజినీర్ డాక్టర్ ఉలవపల్లి గంగాధర్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందించారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను మంగళవారం కలిసి చెక్కు అందజేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

భవానీపురం, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా భవానీపురం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, కోళ్లఫారం రోడ్డు, ఐఓసీ పెట్రోల్ బంకు రోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏడీసీపీని కలిసిన తెదేపా నాయకులు



విజయవాడ అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణను తెదేపా నాయకులు మంగళవారం కలిశారు. దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని, భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని కోరారు. వాహన చోదకులను పైవంతెన మార్గంలో అనుమతించాలన్నారు. నాయకులు యేదుపాటి రామయ్య, చిన్న సుబ్బయ్య, గాలీబ్ షహీద్, తదితరులు ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు.

\- న్యూస్‌టుడే, భవానీపురం

రాష్ట్ర అడ్వకేట్స్ క్రికెట్ జట్టు సారథిగా క్రాంతికుమార్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: లక్నోలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు దూబా క్రాంతికుమార్ (విజయవాడ) సారథ్యం వహిస్తారని రాష్ట్ర అడ్వకేట్స్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు పొన్నేరు సురేష్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. ఈ టోర్నీలో 16 హైకోర్టు అడ్వకేట్స్ క్రికెట్ జట్లు తలపడతాయని పేర్కొన్నారు.

3 నుంచి క్రికెట్ టోర్నీ

విజయవాడ క్రీడలు: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల(పీజీ)ను ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాలలో నిర్వహిస్తామని వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. 15 జట్లు ఈ టోర్నీలో తలపడతాయని పేర్కొన్నారు.

బాపూజీ జీవితం ప్రపంచానికే ఆదర్శం

నేడు గాంధీ దీక్షల విరమణ

చిట్టినగర్, న్యూస్‌టుడే



గాంధీ దేవాలయం

మహాత్మాగాంధీ జీవితం ప్రపంచానికే ఆదర్శం కావడంతో ఆయన నడిచిన మార్గంలో ప్రతి ఒక్కర్ని నడిపించాలని తలపించారు. గాంధీ ఆశయాలను విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయాలనే లక్ష్యంతో గాంధీ దీక్షలకు శ్రీకారం చుట్టారు. శాంతి, అహింస, సత్యాగ్రహాలే ఆయుధంగా మహాత్ముడు మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన నేపథ్యంలో నేటి తరం ఆయన బాటలోనే సాగుతూ శాంతికాములుగా ఎదగాలని సంకల్పతోనే స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, సయ్యద్ అప్పలస్వామి కళాశాల కార్యదర్శి, గాంధీ దేవాలయం వ్యవస్థాపకుడు రాంపిళ్ల జయప్రకాష్ 2012లో గాంధీ దీక్షలు ప్రారంభించారు. మహాత్ముడి ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగితే దేశాభ్యున్నతికి దోహదపడతారని తమ వంతు బాధ్యతగా, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంగా ఈ దీక్షలను ముందుకు తీసుకు వెళ్తున్నారు. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా గాంధీ దేవాలయంలో దీక్షల విరమణ చేయనున్నారు. ఈ దీక్షలు చేపట్టిన దీక్షాపరులు తమ మనోభావాలను ఇలా వ్యక్తం చేస్తున్నారు.

మనసు ప్రశాంతంగా ఉంది



శాంతి, అహింస పరమావధిగా భావించి 5 ఏళ్లుగా గాంధీ దీక్ష తీసుకుంటున్నా. 21 రోజుల మండల దీక్ష చేపట్టాను. ఆయన సిద్ధాంతాలను కొంతైనా ఆచరణలో పెడితే సమాజానికి మేలు జరుగుతుందనేది నా భావన. దీక్ష చేపట్టిన దగ్గర నుంచి మనసు ప్రశాంతంగా ఉంటుంది. అబద్ధం ఆడకుండా, ఉన్నది ఉన్నట్లు చెప్పడం అలవాటైంది. దీనివల్ల మాంసాహారాన్ని పూర్తిగా వదిలేశాను. దీక్షలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తున్నా. - టి.హనుమ, గృహిణి

కోపం తగ్గించుకున్నాను



గాంధీ తాత అంటే నాకు ఇష్టం. అందుకే 5 ఏళ్లుగా గాంధీ దీక్ష తీసుకున్నా. తెల్లటి దుస్తులు ధరిస్తున్నాను. పాఠశాలకు వెళ్లినప్పుడు తోటి వారితో స్నేహభావంతో ఉంటున్నా. ఎవరైనా తిడితే పట్టించుకోను. గాంధీజీ చెప్పినట్లు సహనం పాటిస్తున్నాను. గతంలో బాగా కోపం ఉండేది. దీక్ష తీసుకున్న దగ్గర నుంచి దాన్ని తగ్గించుకున్నాను. చురుకుగా ఆలోచన చేయగలుగుతున్నాను. చెడు భావం మనసులోకి రావడం లేదు. - చైతన్య, 9వ తరగతి విద్యార్థి

ఇసుక క్వారీలను తెరిపించాలి



తహసీల్దారు కార్యాలయంలో అధికారికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించేలా ఇసుక క్వారీలను సకాలంలో తెరిపించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి పెద్దిరాజు పేర్కొన్నారు. ఇసుక క్వారీలను తెరిపించాలంటూ భవానీపురంలోని పశ్చిమ తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయంలోని అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు షేక్.బాజీ, బ్రహ్మయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ప్రదర్శన



స్టాల్స్ వద్ద సందర్శకులు

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పండగలు, రానున్న వివాహాల సందర్భంగా విజయవాడ ఎంజీ రోడ్డు మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే వెడ్డింగ్ పాపప్ షాప్ ప్రదర్శనను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అంజలి, భవ్య మాట్లాడుతూ.. బంగారం, డైమండ్, చీరలు, డ్రస్సెస్, ఫ్యాషన్ యాక్సెసరీస్‌తో పాటు ఒక గ్రాము జ్యూయలరీ ఉత్పత్తులను 75కి పైగా స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రదర్శన బుధవారం రాత్రి 8 గంటల వరకు మాత్రమే ఉంటుందని, ప్రజలు సందర్శించాలని కోరారు.

నగరంలో 'హై లైఫ్' ప్రదర్శన



ఆభరణాలతో మోడళ్లు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: దేశంలోనే ప్రసిద్ధిగాంచిన 'హై లైఫ్' ప్రదర్శన, అమ్మకాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విజయవాడ నోవోటెల్ హోటల్‌లో ప్రారంభించిన ప్రదర్శనలో దేశంలోనే ప్రసిద్ధిగాంచిన వివిధ రాష్ట్రాల వస్త్రాలతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. హై లైఫ్ ఎగ్జిబిషన్ ఎండీ, సీఈవో అబి పి డొమినిక్ మాట్లాడుతూ.. వెడ్డింగ్ ఫ్యాషన్స్, జ్యువెలరీ, బ్రైడల్ ఫ్యాషన్‌తో పాటు లైఫ్ స్టైల్ ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. వధువు మెచ్చే అధునాతన డ్రెస్‌లు, వెడ్డింగ్ చీరలు, డిజైనర్ అప్రెరల్, బ్రైడల్ ఆభరణాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రదర్శన ఎక్స్‌క్లూజివ్‌గా యువత, మహిళలు మెచ్చేవిధంగా ఉందని, నాణ్యమైన డ్రస్సులు, చీరలు, ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రదర్శన బుధవారం కూడా ఉంటుందని, నగర ప్రజలు సందర్శించాలని కోరారు.

ప్లాస్టిక్ వద్దు.. పర్యావరణమే ముద్దు



అవగాహనా ర్యాలీలో విద్యార్థులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కలసిరావాలని కళాశాల కార్యదర్శి అమరసుధీర్ అన్నారు. స్వచ్ఛభారత్ దివస్ పురస్కరించుకుని భారత ప్రభుత్వం, జేఎన్‌టీయూ కాకినాడ వారి ఆదేశాల మేరకు పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల వల్ల ప్రజారోగ్యానికి చేటు తెస్తున్నాయన్నారు. పర్యావరణంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్లాస్టిక్ వద్దు- పర్యావరణమే ముద్దు, చెట్లు నాటండి- జీవితాలను కాపాడండి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి పంజా సెంటర్ వరకు సాగింది. కళాశాల ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి, శ్రీకాంత్‌రెడ్డి, కో-ఆర్డినేటర్స్ నవీన్‌కుమార్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి రుద్ర సహిత ద్విశత చండీయాగం



ప్రచార ప్రతులు ఆవిష్కరిస్తున్న కళాశాల కమిటీ సభ్యులు

చిట్టినగర్: శ్రీకన్యకాపరమేశ్వరీ విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈ నెల 3 నుంచి 12 వరకు శ్రీరుద్ర సహిత ద్విశత చండీ యాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య తెలిపారు. కేబీఎన్ కళాశాల కమిటీ కార్యాలయంలో ఉత్సవాల ప్రచార ప్రతులను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఉన్న దాసాంజనేయ స్వామి దేవస్థానం వేదికగా శరన్నవరాత్రుల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చండీసప్తసతి హోమంతో పాటుగా అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీహోమం చేయడం ప్రత్యేకత అన్నారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్, కోశాధికారి గోళ్ల బాబా విజయ్‌కుమార్, హరగోపాల్, రామకిషోర్, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ త్రైక్వాండో, సాఫ్ట్ టెన్నిస్ జట్లకు ఎంపికైన విద్యార్థినులను మంగళవారం ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.పద్మజ తన కార్యాలయంలో అభినందించారు. సీహెచ్ ఉష, డి.మేఘన, ఎ.రిషితరెడ్డి, ఎస్.భవిష్య, యోచిత, పి.సిరి, పి.బిందు గంగాభవ్యశ్రీ, ఎం.సిరివల్లి జిల్లా త్రైక్వాండో జట్టులో స్థానం సాధించగా.. ఎన్.నిషాంత్, జె.అనన్య, పి.సిరి, ఎల్.సరన్య, ఎస్.లీలామృత సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

అధిక నిధుల విడుదలకు డిమాండ్



సీపీఐ నాయకుల నినాదాలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కృష్ణా నది, బుడమేరు వరదలను కేంద్ర ప్రభుత్వం జాతీయవిపత్తుగా ప్రకటించి అధిక నిధులను విడుదల చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం లెనిన్‌కూడలిలో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. వరద బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం ఏ మాత్రం సరిపోవడం లేదని, దాన్ని పెంచాలని కోరారు. కొన్ని డివిజన్లలో బాధితులను గుర్తించే ప్రక్రియ అరకొరగా సాగిందని.. అసలైన బాధితుల్లో చాలా మంది వివరాలు నమోదు చేయలేదని విమర్శించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యాధరపురంలో పేర్లు నమోదు చేయలేదంటూ రోడ్డెక్కిన బాధితులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవనాధారమైన ఆటోలు వరదల్లో మునిగిపోవడంతో కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇస్తున్న పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, తాడి పైడియ్య, బుట్టి రాయప్ప, కె.వి.భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, డి.వి.రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విజయవాడ సిటీ: మంగళగిరిలో మంగళవారం జరిగిన ప్రజాదర్బార్‌కు బాపట్ల జిల్లా చీరాల మండలం బుగ్గలవారి పాలెం గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. వరుసలో నిలబడిన ఆయన పురుగుల మందు తాగడాన్ని అక్కడ ఉన్న వారు గమనించారు. వెంటనే అతన్ని 108లో వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన వెంకటేశ్వరరెడ్డిని ఐసీయూలో ఉంచి వైద్యులు వైద్యం అందిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

భవానీపురం, న్యూస్‌టుడే : విద్యాధరపురం సితార సెంటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి...సితార సెంటర్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద గుర్తు తెలియని వ్యక్తి చనిపోయినట్లుగా స్థానికులు పోలీసులకు తెలిపారు. దీంతో వారు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అనుమానాస్పద మృతి కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడ మధ్య

సీతారాంపురం, న్యూస్‌టుడే : వాంబేకా లని బాలాజీ టవర్స్ వద్ద ఖాళీ ప్రదేశంలో నీళ్లు నిల్వ ఉంటున్నాయి. దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు సమాచారం అందించారు. దీనిపై గత నెల 28న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. వీఎంసీ రామకోటేశ్వరరావు స్పందించారు. నీళ్లు తోడే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

★ నగరంలో ఇటీవల వరదలకు ఇందిరానాయక్ నగర్‌లో ఇంటి నం:43-106/1-116ని గల గ్రౌండ్ ఫ్లోర్ పూర్తిగా బురదతో పేరుకుపోయింది. స్థానికుడు దుర్గా సుబ్రహ్మణ్య శ్రీనివాస్ 'మేమున్నాం మీకు తోడు'గా'కు తెలిపారు. ఈ విషయాన్ని అగ్ని మాపక సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా.. మంగళవారం వారి వచ్చి గ్రౌండ్ ఫ్లోర్, రోడ్డు అంతా శుభ్రం చేశారు.

? నందమూరినగర్ గుండప్ప చలపతిరావు వీధిలో పిచ్చి చెట్లు, బురద పేరుకుపోయాయి. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

\- దాసరి దుర్గాప్రసాద్, స్థానికుడు

✔ పరిశీలించి శుభ్రం చేయిస్తాం.

\- వి.రామకోటేశ్వరరావు, ఏఎంవోహెచ్, వీఎంసీ

\- సీతారాంపురం, న్యూస్‌టుడే

శ్మశాన వాటికలో మురుగు తొలగింపు

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : పాయకాపురంలోని నూరే చమన్ ఖబరిస్తాన్‌లో వరద నీరు నిలిచిపోయింది. బయటకు పోయే మార్గం లేకుండా పోయింది. ఖననానికి ఇబ్బందులు ఏర్పడటంతో ముస్లిం మైనార్టీ నాయకులు పలువురు.. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు తమ సమస్య తెలిపారు. ఆయన వెంటనే స్పందించి నగరపాలకసంస్థ అధికారులకు ఫోన్ చేశారు. వారు అక్కడకు చేరుకుని, మోటారు పెట్టి మురుగునీటిని తొలగించి సమస్యను తీర్చారు. ముస్లిం నాయకులు గౌస్ బాషా తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి వీఎంసీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలికల నియోజకవర్గ స్థాయి బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. సుమారు 200 మంది పాల్గొన్నారని పోటీల కన్వీనర్ ఎం.నారాయణస్వామి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చదరంగం జట్ల ఎంపికలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు, వ్యాయామోపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యాయవాద క్రీడాకారులకు సన్మానం



విజేతలతో చంద్రమౌళి, శివరామప్రసాద్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన నగరవాసులను బెజవాడ బార్ అసోసియేషన్ సన్మానించింది. మంగళవారం మధ్యాహ్నం బీబీఏ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సత్కరించారు. క్యారమ్స్‌లో కె.కుమార శ్రీనివాస్, పులిపాక రాజా, జాక్ విక్టర్, ఎస్.సత్యానందరావులు.. చదరంగంలో మరీదు శ్రీనివాసరావు, షటిల్‌లో ఎస్.లత, బి.వి.అరుణాదేవి, బి.వి.అరుణాదేవి, ఎస్.లతలు బహుమతులు సాధించారు. వీరిని బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు.

కన్నెత్తి చూశారు.. నోరెత్తకుండా వెళ్లారు!

అక్రమ నిర్మాణంపై పట్టించుకోని అధికారులు

గోడలు లేపి... రేకులు వేసిన అక్రమార్కులు

విజయవాడ, న్యూస్‌టుడే

మధురానగర్ ఏలూరు కాలువ గట్టుపై కొబ్బరితోట వద్ద నవరాత్రుల ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణంపై అధికారుల తీరును స్థానికులు తప్పుపట్టారు. అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాన్ని తొలగించకుండా తాత్సారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నవరాత్రుల ముసుగులో కబ్జా' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనం.. అధికారులను పరుగులు పెట్టించింది. ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు శ్రీకాంత్, హారిక ఇతర సిబ్బంది.. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎవరి అనుమతి తీసుకుని గుడి కడుతున్నారని నిర్వాహకులను ప్రశ్నించారు. తక్షణం నిలుపుదల చేయాలని ఆదేశించి.. ఆ తర్వాత వెళ్లిపోయారు. ఆ సమయానికి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పింఛన్ల పంపిణీకి అదే ప్రాంతానికి విచ్చేశారు. స్థానికులు విజ్ఞప్తి మేరకు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లిపోయారు.

చంద్రబాబు చూస్తారా ఏంటీ?

దసరా ఉత్సవాల పేరుతో గుడి కడుతున్న విషయం పత్రికలో రావడంతో.. స్థానికులు హర్షం వెలిబుచ్చారు. కొంత మంది ఉత్సవ నిర్వాహకులను దీనిపై బాహాటంగానే ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు ఇలాంటి ఆక్రమణలను ఊరుకోరని తెదేపాలోని కొంత మంది నాయకులు అనగానే 'ఏ.. చంద్రబాబు ఇక్కడకు వచ్చి చూస్తారా?'..



పూర్తయిన నిర్మాణం...

తొలగిస్తాం : శ్రీకాంత్, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ

మేం పింఛన్ల పంపిణీలో బిజీగా ఉన్నాం. 3 అడుగుల మేర గోడలు కట్టారు. దాన్ని నిలుపుదల చేశాం. నిర్మాణం చేస్తే ఊరుకు నేది లేదని స్పష్టం చేశాం. దసరా ఉత్సవాల తర్వాత అనుమతులు ఉన్నాయా.. ఆ తర్వాత అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేకుండా తొలగిస్తాం.

అంటూ ఏకవచనంతో వ్యాఖ్యానించడం కలకలం రేపింది. అక్రమాలపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారుల నిర్లిప్తత వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

సిబ్బంది తీరుపై అనుమానాలు

గుడి నిర్మాణం అడ్డుకోవాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు.. కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారు. నిర్మాణం ఆపివేయమంటూ చెప్పి.. గప్‌చుప్‌గా అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు అటు వెళ్లగానే షరా మామూలే అన్నట్లుగా నిర్వాహకులు గోడలు చుట్టూ ఇనుప గడ్డర్లు లేపారు. పైన రేకులు వేసి నిర్మాణం పూర్తి చేశారు. నిర్వాహకులు మా మాట జవ దాటరు అన్నట్లుగా పట్టణ ప్రణాళికాధికారులు వ్యవహరిస్తుండడం స్థానికులను విస్మయ గొలిపింది. అక్రమ కట్టడాలను నియంత్రించి కబ్జాదారులపై కొరడా ఝళిపించాల్సిన సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు.. పట్టనట్లు వ్యవహరించడం వెనుక పెద్దలు ఎవరైనా ఉన్నారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు.

క్యూలైన్లలో భక్తులకు తాగునీరు అందించండి



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, న్యూస్‌టుడే : క్యూలైన్లలో వేచే భక్తులకు తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాగు నీటిని అందించేందుకు 25 పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ క్యూలైన్లలో నీటిని అందించాలని సూచించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల్లో ఏ విధమైన లోపాలు తలెత్తకుండా చూడాలని కోరారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆరు ప్రాంతాల్లో ఉచిత క్లోక్ రూంలు, చెప్పుల స్టాండ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చీఫ్ మెడికల్ అధికారి పి.రత్నావళి, సిటీ ప్లానర్ జీ.వీ.జి.ఎస్.వి.ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం

చుట్టుగుంట, న్యూస్‌టుడే : భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 25వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం చుట్టుగుంటలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాచవరం డౌన్ పడవలరేవు సెంటర్ వరకు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఏపీ సర్కిల్ సీజీఎం ఎం.శేషాచలం ర్యాలీని ప్రారంభించారు. పీజీఎంలు వై.రవీంద్రనాథ్, బుంగా రవికుమార్, జీఎంలు రత్నబాబు, సత్యప్రసాద్, తాతా వెంకట ప్రసాద్ తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భవనాన్ని విద్యుత్తుదీప కాంతులతో అలంకరించారు.



ఏలూరు రోడ్డులో ఉద్యోగుల ప్రదర్శన

పాఠశాలలకు జోస్ అలూకాస్ వితరణ


అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : వరదల్లో నష్టపోయిన నగరపాలక సంస్థ పాఠశాలలకు ప్రముఖ ఆభరణాల సంస్థ జోస్ అలూకాస్ సంస్థ అండగా నిలిచింది. బుడమేరు వరదలతో అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాల్లో పాఠశాలల్లో కంప్యూటర్లు, పుస్తకాలు, మైక్ సెట్లు, వాటర్ కూలర్లు పాడైపోయాయి. వీటిని ఎంకే బేగ్ పాఠశాల, పుచ్చలపల్లి సుందరయ్య పాఠశాల, బి.వి.సుబ్బారెడ్డి పాఠశాల, సత్యనారాయణపురం ఏకేటీపీఎం పాఠశాలలకు ఇచ్చేందుకు జోస్ అలూకాస్ విజయవాడ శాఖ ముందుకు వచ్చింది. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పలు పాఠశాలలకు రూ.9లక్షల విలువైన కంప్యూటర్లు, వాటర్ కూలర్లు, మైక్ సెట్లు, ఐరన్ ర్యాక్‌లను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏకేటీపీఎం స్కూలు ప్రతినిధులకు కంప్యూటర్లు, చెక్కు అందిస్తున్న బొండా ఉమామహేశ్వరరావు

వృద్ధులకు కేర్ సెంటర్లు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నగరంలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌లు, కేర్ సెంటర్లు పెట్టేలా నగర పాలక సంస్థలో ప్రతిపాదన పెడతానని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం గవర్నర్‌పేటలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పింఛను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు మాట్లాడుతూ.. వృద్ధుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భారత్ పథకం ప్రవేశపెట్టిందని.. దీన్ని అందరూ నమోదు చేసుకోవాలని కోరారు. వృద్ధుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనాభాలో 60 శాతం ఉన్న వృద్ధుల కోసం ప్రత్యేకశాఖ లేకపోవడం బాధాకరమన్నారు. 101 సంవత్సరాల ఆదుసుమిల్లి వెంకాయమ్మతో పాటు 75 సంవత్సరాలు పైబడిన 13 మంది వృద్ధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కామరాజు, డాక్టర్ జి.వి.మోహన్‌ప్రసాద్, తొండెపు హనుమంతరావు, వేమూరు బాబూరావు, నాదెళ్ల సుమతి తదితరులు పాల్గొన్నారు.



వెంకాయమ్మను సన్మానిస్తున్న బాలస్వామి, మోహన్‌ప్రసాద్, హనుమంతరావు తదితరులు

ప్లాస్టిక్ వినియోగం.. అనర్థం

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : ప్లాస్టిక్ వస్తువులు, సంచుల వినియోగంతో పలు రకాల వ్యాధులు వస్తున్నాయని 32వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయక్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు నగర పాలక సంస్థకు సహకారం అందించాలని కోరారు. అయోధ్య నగర్‌లో కళాజాత ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగించమని స్థానికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. గంగాధర్ బృందం పాటలతో అలరించారు.

కంచెలతో పాగా..!

పార్కు ప్రవేశ ద్వారాలు మూసివేత

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

నగరంలోని లెనిన్ సెంటరులో రూ.75 లక్షల ఖర్చుతో నిర్మించిన 'ఐలాండ్ పార్కు'పై కబ్జాదారులు కన్నేశారు. ప్రవేశ ద్వారాలను మూసివేసి, అక్కడ తోపుడు బండ్లు పెట్టి దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ప్రవేశ మార్గాలను మూసివేయడంతో పక్కనే ఉన్న ఏలూరు రోడ్డుపై పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. లోపలకు వెళ్లకుండా ప్రవేశ మార్గాలకు అడ్డంగా కంచెలు కట్టారు. ఆటు వైపు ఎవరూ రాకుండా చేసి.. నెమ్మదిగా వ్యాపారాల కోసం ఆక్రమించుకొని దుకాణాలు పెడుతున్నారు. దీనిపైనా తీశారు. స్థానికులు తోపుడు బండ్ల వ్యాపారులు వాడుకుంటున్నారు. నీరులా ఆ ప్రాంతాలను ఆక్రమించేయవచ్చని ఇలా చేస్తున్నారని స్పష్టమైంది.



ప్రవేశ ద్వారాన్ని కంచెలతో మూసేశారు..



రెండో వైపు ఇలా..

సూత్రధారి ఎవరు..?

విజయవాడ నగరం నడిబొడ్డున చిన్నారులను ఆకట్టుకునేలా ఈ ఐలాండ్ పార్కును నిర్మించారు. 2021, ఆగస్టు 6న దీన్ని ప్రారంభించారు. తర్వాత మెట్లు తోపుడు బండ్లు వెలిశాయి. ప్రవేశద్వారాలు వద్ద మాత్రం ఖాళీగా ఉంచారు. అక్కడ రెండేసి బండ్లు పెట్టుకునే స్థలం ఉండడంతో.. కబ్జాదారుల కన్నుపడింది. తొలుత బండ్లు అద్దెకు ఇచ్చే ఓ వ్యక్తి.. ఆక్రమణకు యత్నిస్తున్నారు. తొలుత ఒక చెప్పుల కొట్టుకు అద్దెకు దిగిన ఆ వ్యక్తి తర్వాత మరో బండిని అద్దెకు తీసుకున్నారు. ఆ తర్వాత సరకు పెట్టుకునేందుకు నెపంతో దాని పక్కనే మరో రెండు బండ్లు పెట్టారు. ఇలా మొత్తం ఆరు బండ్లు నిర్వహిస్తున్నారు. మరో నాలుగు పెట్టేయబోతున్నారు. పార్కు ప్రవేశద్వారాలను మూసివేసినట్లు స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇతనికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో.. అధికారులు తెలిసినా మౌనమే దాల్చి పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఆక్రమిత దారుల ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకుని.. లేదా ప్రవేశద్వారాలను అందుబాటులోకి తేవాలని.. అలా కట్టబడితే ఆ వేలి మాదాలి వుండాలి.

మేమున్నామనీ.. మీకేం కాదనీ..!



దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న చుక్కపల్లి అరుణ్‌కుమార్ తదితరులు



లయన్స్ క్లబ్ నాయకులు శేషగిరి, రవికుమార్, ప్రసాద్ తదితరులు..



పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్‌మెంటు వాసుల వితరణ

అజిత్ సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. బాధితుల ఇంటికి వెళ్లి అవసరమైన గృహోపకరణ వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్‌మెంటు వాసులు.. అజిత్‌సింగ్‌నగర్‌లోని లెనిన్ సెంటరులో బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. అపార్ట్‌మెంట్ వాసులు రూ.1.5లక్షలు విరాళంగా సేకరించి చీరలు, దుప్పట్లు, టవల్స్, లుంగీలు కొనుగోలు చేశారు. అధ్యక్షుడు మళ్లపూడి భగవాన్ చేతుల మీదుగా అందించారు. బలరాం, జ్యోతిర్మయి, భానుమూర్తి, కేశవర్దన్, రవికుమార్‌లు పాల్గొన్నారు.

★ వాంబేకాలనీలోని ది వీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. పారిశ్రామిక వేత్త, సొసైటీ వ్యవస్థాపక ఛైర్మన్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ బాధితులకు అందించారు. రూ.4.2 లక్షల విలువైన కిట్లను పంపిణీ చేశారు. అలాంద్ ఎల్లారావు, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

★ మధురానగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్ తరఫున 100 మంది బాధితులకు దుప్పట్లు, లుంగీలు, టవల్స్, చాపలు పంచారు. జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి, క్లబ్ అధ్యక్షుడు కె.వి.రవికుమార్, నెక్కంటి ప్రసాద్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నగరంలో 'హై లైఫ్' ప్రదర్శన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: దేశంలోనే ప్రసిద్ధిగాంచిన 'హై లైఫ్' ప్రదర్శన, అమ్మకాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో ప్రారంభించిన ప్రదర్శనలో దేశంలోనే ప్రసిద్ధిగాంచిన వివిధ రాష్ట్రాల వస్త్రాలతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. హై లైఫ్ ఎగ్జిబిషన్ ఎండీ, సీఈఓ అబి పి డొమినిక్ మాట్లాడుతూ.. వెడ్డింగ్ ఫ్యాషన్, జ్యువెలరీ, బ్రైడల్ ఫ్యాషన్‌తో పాటు లైఫ్ స్టైల్ ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. వధువు మెచ్చే అధునాతన డ్రెస్‌లు, వెడ్డింగ్ చీరలు, డిజైనర్ అప్పెరల్, బ్రైడల్ ఆభరణాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రదర్శన ఎక్స్‌క్లూజివ్ వస్త్రాలు, మహిళలు మెచ్చేవిధంగా ఉందని, నాణ్యమైన డ్రెస్సులు, చీరలు, ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రదర్శన బుధవారం కూడా ఉంటుందని, నగర ప్రజలు సందర్శించాలని కోరారు.



ఆభరణాలతో మోడళ్లు

ఆకట్టుకుంటున్న ప్రదర్శన

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పండగలు, రానున్న వివాహాల సందర్భంగా విజయవాడ ఎంజీ రోడ్డు మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే వెడ్డింగ్ పాపప్ ప్రదర్శనను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అంజలి, భవ్య మాట్లాడుతూ.. బంగారం, డైమండ్, చీరలు, డ్రెస్సెస్, ఫ్యాషన్ యాక్సెసరీస్‌తో పాటు ఒక గ్రామ్ జ్యూయలరీ ఉత్పత్తులను 75కి పైగా స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రదర్శన బుధవారం రాత్రి 8 గంటల వరకు మాత్రమే ఉంటుందని, ప్రజలు సందర్శించాలని కోరారు.



స్టాల్స్ వద్ద సందర్శకులు

తెదేపా హయాంలోనే సామాజిక పింఛన్లు

చుట్టుగుంట, సీతారాంపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో తెదేపా హయాంలోనే సామాజిక పింఛన్లు ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 26వ డివిజన్, 25వ డివిజన్‌లో పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ హయాంలో నెలకు రూ.35ల చొప్పున అందించగా.. చంద్రబాబు సీఎం కాగానే దాన్ని రూ.75లకు పెంచారని చెప్పారు. రూ.3వేలకు పెంచుతామని 2019 ఎన్నికల ప్రచారంలో వైకాపా చెప్పిందని, కానీ.. రూ.250లు మాత్రమే పెంచిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఒకేసారి రూ.1,000లు పెంచిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కడియం ప్రకాష్, కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, నాయకులు వల్లభనేని సతీష్, మాచర్ల గోపీనాథ్, అధ్యక్షుడు తోట పద్మ, కాలంపూడి సత్య, ఐను కుల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



26వ డివిజన్‌లో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ రాజేశ్వరి

మధురానగర్, న్యూస్‌టుడే : సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం 1వ తేదీన ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇస్తున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మధురానగర్ కొబ్బరితోటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలందరికీ మెరుగైన పాలన అందించడమే లక్ష్యమని వివరించారు. స్థానిక తెదేపా నాయకులు పలువురు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం : ముత్యాలంపాడులో మంగళవారం మాజీ కార్పొరేటర్ త్రిమూర్తిరాజు, పటమట రామకృష్ణ తదితరులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు.

అధిక నిధుల విడుదలకు డిమాండ్



సీపీఐ నాయకుల నినాదాలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కృష్ణా నది, బుడమేరు వరద లను కేంద్ర ప్రభుత్వం జాతీయవిపత్తుగా ప్రకటించి అధిక నిధులను విడుదల చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం లెనిన్‌కూడలిలో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. వరద బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం ఏ మాత్రం సరిపోవడం లేదని, దాన్ని పెంచాలని కోరారు. కొన్ని డివిజన్లలో బాధితులను గుర్తించే ప్రక్రియ అసంపూర్తిగా సాగిందని.. అసలైన బాధితుల్లో చాలా మంది వివరాలు నమోదు చేయలేదని విమర్శించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యాధరపురంలో పేర్లు నమోదు చేయలేదంటూ రోడ్డెక్కిన బాధితులపై పోలీసు లాఠీఛార్జి చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవనాధారమైన ఆటోలు వరదల్లో మునిగిపోవడంతో కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇస్తున్న పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, పంచదార్ల దుర్గాంబ, బుట్టి రాయప్ప, కె.వి.భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, డి.వి.రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

'మేకింగ్ ఆఫ్ మహాత్మా' చిత్ర ప్రదర్శన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ కల్చర్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ జయంతి నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు 'మేకింగ్ ఆఫ్ మహాత్మా గాంధీ' సినిమాను కళాశాల థియేటర్‌లో చూపించారు. విద్యార్థులకు దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయడానికి, వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని కళాశాల డైరెక్టర్ జోజిరెడ్డి అన్నారు.

వారాహి సభ జయప్రదానికి పిలుపు

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జనసేన పార్టీ ఆశాకిరణంలా ఎదుగుతుందని మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత సామినేని ఉదయభాను అన్నారు. మంగళవారం పటమటలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేకూర్చేలా పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో డైనేజీలు శుభ్రం చేయడానికి కూడా పంచాయతీల వద్ద నిధులు ఉండేవి కాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీలను పవన్ కళ్యాణ్ బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. 9 వేల గ్రామ సభలు ఒకే రోజు ఏర్పాటు చేసి రికార్డు సృష్టించారన్నారు. పవన్ ప్రాయశ్చిత్త దీక్ష ఒక మతానికి సంబంధించింది కాదని స్పష్టం చేశారు. ఈ నెల 3న తిరుపతి నిర్వహించే వారాహి సభకు రాష్ట్రంలో జనసైనికులు తరలిరావాలని సూచించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిసెట్టి వాసు, నాయకులు గాదిరెడ్డి అమ్ములు, బాడిత శంకర్, కొప్పిరెడ్డి ఎస్.ఎన్.మూర్తి, బోడపాటి శివదత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయభాను

జిల్లా పారా స్విమ్మర్లకు అభినందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా పారా స్విమ్మర్లు.. సత్తా చాటారని జిల్లా ఆక్వాటిక్ సంఘం కార్యదర్శి బి.రమేష్ అన్నారు. గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గత నెల 29న విశాఖలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా పారా జట్టు 16 పసిడి, నాలుగు రజత, రెండు కాంస్య పతకాలు సాధించిందని చెప్పారు. మొత్తం 92 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. పతకాలు సాధించిన వారిని అభినందించారు. పూల్ ఇన్‌ఛార్జి ఎం.రాంబాబు, శిక్షకులు ఎం.మాల్యాద్రి, జె.సైదులు, శిక్షకుడు, పారా స్విమ్మర్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.



క్రీడాకారులతో రమేష్, సైదులు, మాల్యాద్రి

మద్యం దుకాణాలకు తొలిరోజు 200 దరఖాస్తులు



- అడ్డొచ్చిన అమావాస్య సెంటిమెంట్
- మొత్తం లక్షకు పైగా అర్జీలు రావొచ్చని అంచనా
- నాన్ రీఫండబుల్ రుసుముల రూపేణా రూ.2 వేల కోట్ల ఆదాయం!
- ఆన్‌లైన్‌లో అర్జీల స్వీకరణకు ప్రత్యేక వెబ్‌పోర్టల్

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో కొత్తగా మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా, తొలిరోజైన మంగళవారం 200కు పైగా వచ్చాయి. వీటిలో ఆఫ్‌లైన్ విధానంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్లలో నేరుగా సమర్పించినవే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి ఎక్సైజ్ శాఖ సోమవారం అర్ధరాత్రి తర్వాత నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం అమావాస్య కావడంతో వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. మొత్తంగా లక్షకు పైగా దరఖాస్తులు రావొచ్చని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుముల రూపంలోనే దాదాపు రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. 2017లో 4,380 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఒక్కో దానికి సగటున 18 చొప్పున మొత్తంగా 78 వేల దరఖాస్తులు అందాయి. ఈసారి 3,396 దుకాణాలకుగానూ ఒక్కో దానికి సగటున 30 వరకు దరఖాస్తులు పడతాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 9 వరకు గడువు ఉండగా, చివరి మూడు రోజుల్లో ఎక్కువ దరఖాస్తులు పడే అవకాశముంది.

ఆన్‌లైన్‌లో అయితే..

మద్యం దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్ తీసుకొచ్చింది. hpfsproject.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫోన్‌నంబర్‌నే యూజర్ ఐడీగా వినియోగించుకొని, పాస్‌వర్డ్ సృష్టించుకోవాలి. తర్వాత యూజర్ నేమ్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీతో లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన సమగ్ర యూజర్ మాన్యువల్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దరఖాస్తు విధానానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెబ్‌సైట్‌లో పెట్టారు.

విశాఖలో గరిష్ఠం

ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసిన 3,396 దుకాణాల్లో 2,261 (66.57 శాతం) మండలాల్లోనే ఏర్పాటు చేయనుంది. నగరపాలక సంస్థల పరిధిలో 511, పురపాలక సంఘాల్లో 499, నగర పంచాయతీల్లో 125 చొప్పున నోటిఫై చేసింది. అత్యధికంగా విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలో 136, గుంటూరులో 52 చొప్పున ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా తిరుపతిలో 227, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 40 దుకాణాలను నోటిఫై చేసింది.

అందుబాటులో కోరుకున్న మద్యం బ్రాండ్లు

నూతన మద్యం విధానంలో భాగంగా దుకాణాల్లో నేషనల్, మల్టీ నేషనల్ బ్రాండ్లను అందుబాటులో ఉంచనుంది. వినియోగదారులు కోరుకునే బ్రాండ్లన్నీ విక్రయిస్తారు. సరఫరా కంపెనీల నుంచి మద్యం కొనుగోలు కోసం చెల్లించే బేసిక్ ప్రైస్ (మూల ధర)ను చెల్లించేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీ వేయనుంది. 90 రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం మద్యంపై 10 రకాల పన్నులు విధిస్తుండగా, తాజా విధానంలో వాటిని ఆరుకు కుదించారు. ఎక్సైజ్ డ్యూటీ, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్, వ్యాట్, స్పెషల్ మార్జిన్, అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం, రౌండింగ్ ఆఫ్ పన్నులు ఉంటాయి.

జిల్లాల వారీగా అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో నోటిఫై చేసిన మద్యం దుకాణాల సంఖ్య

జిల్లా	దుకాణాలు
శ్రీకాకుళం	158
విజయనగరం	153
పార్వతీపురం మన్యం	52
అల్లూరి సీతారామరాజు	40
విశాఖపట్నం	155
అనకాపల్లి	136
కాకినాడ	155
డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ	133
తూర్పుగోదావరి	125
పశ్చిమగోదావరి	175
ఏలూరు	144
కృష్ణా	123
ఎన్టీఆర్	113
గుంటూరు	127
బాపట్ల	117
పల్నాడు	129
ప్రకాశం	171
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	182
కర్నూలు	99
నంద్యాల	105
అనంతపురం	136
శ్రీసత్యసాయి	87
వైఎస్సార్	139
అన్నమయ్య	111
చిత్తూరు	104
తిరుపతి	227

పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు ఓకే

నదీగర్భంలో జిల్లా ఇసుక కమిటీ ద్వారా తవ్వకాలు

- పట్టాదారుకు టన్నుకు రూ.60 చొప్పున చెల్లింపు
- నదీగర్భం బయట పట్టాదారే తవ్వి, విక్రయించేందుకు అవకాశం
- గరిష్ఠంగా టన్ను రూ.250కి మించి అమ్మకూడదు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నదీగర్భంలో, నదిని ఆనుకొని ఉన్న పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇసుక కొరతను తీర్చేందుకు ఆయా భూముల్లో మేటవేసిన ఇసుకను తవ్వి, విక్రయించేందుకు అవకాశం కల్పించింది. నదీగర్భం లోపల ఉండే భూముల్లోని ఇసుకను జిల్లాస్థాయి ఇసుక కమిటీ ద్వారా తవ్వి విక్రయించనుండగా, నదీగర్భం బయట ఉండే భూముల్లో నేరుగా పట్టాదారే తవ్వుకునేందుకు వీలు కల్పించారు. ఈ మేరకు గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయి. పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు మూడు రకాలుగా వీలు కల్పించారు.

పట్టాదారుకు ఇలా..

■ నదీగర్భం లోపల భూముల్లో ఇసుక మేటలు ఉంటే.. పట్టాదారు దరఖాస్తు చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్‌డీడ్ అందజేయాలి. అందులో ఇసుక తవ్వకాలకు అంగీకరిస్తున్నట్లు పేర్కొనాలి.

■ వీటిని జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఆదేశాలతో తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారి, భూగర్భజలశాఖ అధికారి, జలవనరులశాఖ ఈఈ, జిల్లా గనులశాఖ అధికారితో కూడిన బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తుంది.

■ తర్వాత ఆ భూముల్లో ఇసుక తవ్వకాలకు మైనింగ్ ప్లాన్, పర్యావరణ, పీసీబీ అనుమతులను కలెక్టర్ పేరుతో జిల్లా గనులశాఖ అధికారి తీసుకుంటారు. ఈ ఫీజులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుంది.

■ అనుమతులు వచ్చాక, పట్టాదారుతో జిల్లా ఇసుక కమిటీ ఒప్పందం చేసుకుంటుంది. తర్వాత ఈ కమిటీ ద్వారా ఇసుక తవ్వి, విక్రయిస్తారు. ఇలా తవ్విన ఇసుకలో టన్నుకు రూ.60 చొప్పున పట్టాదారుకు చెల్లిస్తారు.

■ ఈ ఇసుక నిల్వలను శాండ్ పోర్టల్‌లో చూపించి, ఆన్‌లైన్ బుకింగ్‌తోనే విక్రయిస్తారు.

ప్రభుత్వ పనులకే..

■ నదీగర్భం బయట ఉన్న భూముల్లో.. గతంలో వరదల వల్ల ఇసుక మేటలు వేసి, మున్ముందు మళ్లీ వరదలతో ఇసుక వచ్చే అవకాశం లేని భూముల్లో జిల్లా ఇసుక కమిటీ ద్వారానే తవ్వకాలు జరిపిస్తారు. ఇలాంటి భూముల్లో తవ్వకాలకు అనుమతులన్నీ జిల్లా గనులశాఖ అధికారులే తీసుకుంటారు. ఈ ఇసుకను ప్రభుత్వ పనులకే వినియోగిస్తారు.

అనుమతులు తెచ్చుకోవాల్సింది పట్టాదారే

■ నదీగర్భం బయట భూముల్లో గతంలో వరదలతో ఇసుక మేటలు ఏర్పడి, మళ్లీ భవిష్యత్‌లో వరదల వల్ల ఇసుక వచ్చే అవకాశం ఉన్నచోట్ల.. పట్టాదారే ఇసుక తవ్వకాలు చేసేందుకు అనుమతిస్తారు. అయితే వీటికి 5 కి.మీ. పరిధిలో ప్రభుత్వ రీచ్‌లు గానీ, పూడిక రూపంలో ఇసుక తవ్వే పాయింట్లు గానీ ఉండకూడదు. ■ పట్టాదారు దరఖాస్తు చేసుకుంటే, ఆయా శాఖల అధికారుల బృందం పరిశీలించి, జిల్లా ఇసుక కమిటీకి నివేదిక ఇచ్చాక, అది అనుమతిస్తుంది. ■ తర్వాత పట్టాదారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ■ అనంతరం పట్టాదారు తన భూమిలో ఇసుక తవ్వి, గనులశాఖ పోర్టల్ ద్వారా టన్ను రూ.250కి విక్రయించాలి. ఇందులో టన్నుకు రూ.88 సీనరేజి కింద మినహాయిస్తారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరకు రెక్కలు

- విజయవాడలో ఇక రూ.1,918

ఈనాడు వాణిజ్య విభాగం: రెస్టారెంట్లలో, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను ఈ నెల 1 నుంచి (మంగళవారం) పెంచినట్లు చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. హైదరాబాద్‌లో ఈ సిలిండర్ ధర రూ.1919 నుంచి రూ.48 పెరిగి రూ.1967కు చేరింది. విజయవాడలో రూ.1,870 నుంచి రూ.48 అధికమై రూ.1,918కి చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సిలిండర్ ధరను ఆగస్టు, సెప్టెంబరులలో కూడా పెంచారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా వీటి ధరలను కంపెనీలు సవరిస్తుంటాయి. ఇళ్లలో వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలో మార్పులేమీ చేయలేదు.

పేదలకు రాయితీపై కందిపప్పు, పంచదార

- రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచే మొదలైన పంపిణీ

రేషన్ దుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార పంపిణీ 16 నెలల తర్వాత మళ్లీ మొదలైంది. దసరాకు ముందే రూ.67కు కిలో కందిపప్పు, రూ.17కు అరకిలో పంచదార పంపిణీ చేయాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా 1.48 కోట్ల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గతేడాది జూన్ నుంచి కందిపప్పు పంపిణీ నిలిపివేయడంతో అప్పటి నుంచి కార్డుదారులు కిలో రూ.170కు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక కందిపప్పు పంపిణీపై దృష్టి పెట్టింది. మూడు నెలల పాటు సరఫరా చేసేందుకు రెండుసార్లు టెండర్లు పిలిచారు. ఇటీవలే ఖరారు చేసి అక్టోబరు నుంచి కార్డుదారులకు పంపిణీ ప్రారంభించారు. సరఫరాలో జాప్యం కారణంగా కొన్ని జిల్లాలకు కందిపప్పు నిల్వలు ఆలస్యంగా చేరినా.. మిగతాచోట్ల మంగళవారం నుంచి పంపిణీ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.


వైకాపా హయాంలో కిలో కోత పెట్టి..

2019 వరకు రేషన్ కార్డుదారులకు రాయితీపై కిలో రూ.40 చొప్పున రెండు కిలోల కందిపప్పు ఇచ్చేవారు. వైకాపా రావడంతోనే కోత పెట్టి కేవలం కిలో చొప్పున పంపిణీ చేసింది. 2020 ఏప్రిల్ నుంచి కిలో ధర రూ.67కు పెంచింది. అయినా పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేయలేదు. ప్రతి నెలా మొత్తం కార్డుల్లో 25% నుంచి 35% మందికి మాత్రమే పప్పు అందేది. 2021 నవంబరు నుంచి 2023 డిసెంబరు వరకు చూస్తే సగటున 30% కుటుంబాలకే కందిపప్పు ఇచ్చారు. జూన్ నుంచి పంపిణీ నిలిపివేశారు. ప్రతి నెలా ధరలు పెరిగి వినియోగదారులపై భారం పడుతున్నా పట్టించుకోలేదు.

జనవరి నుంచి తృణధాన్యాల పంపిణీకి ప్రణాళికలు: మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార అందిస్తామని.. వచ్చే ఏడాది జనవరి నుంచి తృణధాన్యాలు కూడా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో మంగళవారం ఆయన కార్డుదారులకు రాయితీపై కిలో కందిపప్పు, అర కిలో పంచదార అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎందుకా విజ్ఞానం?



మంచి వ్యక్తిత్వం లేనివారికి ఎంతటి విజ్ఞానం ఉన్నా అది దుష్ట శక్తి కిందే లెక్క. మనం ప్రపంచంలో తరచూ చూస్తుండే 'మహా తెలివైన దొంగలు', 'పెద్దమనుషుల్లాంటి వంచకులు' ఈ కోవలోని వారే!

– మహాత్మా గాంధీ

టెట్ పరీక్షకు వేళాయె..!

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏర్పాట్లు

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే

ఏపీటెట్-2024 పరీక్ష ఈనెల 3 నుంచి 21 వరకు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సీబీటీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష) ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికారులు ఇప్పటికే దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశారు. అభ్యర్థులకు ఈ మేరకు సమాచారం పంపించారు.

	ఎన్టీఆర్ జిల్లా	కృష్ణా జిల్లా	పరీక్ష సమయం
మొత్తం అభ్యర్థులు	32,309	25,780	ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
పరీక్ష కేంద్రాలు	6	3	
హెల్ప్ డెస్క్ నెంబర్లు	9676300884 9440506411 9154473676	9700882034 9700857223	
(ఉదయం 7.30 నుంచి సాయంత్రం 7 వరకు మాత్రమే)			

డిపార్టుమెంట్ అధికారుల నియామకం



ప్రతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించడానికి డిపార్టుమెంట్ అధికారులను నియమించడం జరిగింది. ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా ఇద్దరు ఏడీలు, ఇద్దరు ఎంఈవోలను ఏర్పాటు చేశాం. అన్ని ఏర్పాట్లు పక్కాగా చేశాం. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులుంటే హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. **- యువీ సుబ్బారావు, డీఈవో, ఎన్టీఆర్ జిల్లా**

ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు



అభ్యర్థులు పరీక్షకు గంట ముందుగా ఉదయం 8.30 గంటలకే, మధ్యాహ్నం 1.30 గంటలకే చేరుకోవాలి. హాల్ టికెట్‌లో ఫొటోలేనివారు తాజా పాస్‌ఫోటోతో(ఆధార్/పాన్ కార్డు/ ఓటరుకార్డు)తో హాజరుకావాలి. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. **- తాహెరాసుల్తానా, డీఈవో, కృష్ణా జిల్లా**

సామాన్య భక్తులకు ప్రథమ ప్రాధాన్యం



కృష్ణమ్మకు హారతి ఇస్తున్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత తదితరులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : సామాన్య భక్తుల దర్శనానికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఇంద్రకీలాద్రి దిగువన మోడల్ గెస్టు హౌస్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహనరావు, బొండ ఉమామహేశ్వరరావు గతంలో ఎదురైన సమస్యలను మంత్రి ఆనం దృష్టికి తీసుకొచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అమ్మవారి దర్శనం, లడ్డూ, పులిహోర, అన్న ప్రసాదం అందించేందుకు నిర్ణయించామని చెప్పారు. వీఐపీ దర్శనాలు సైతం ఉదయం 8 నుంచి 10 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటలు ఉంటుందన్నారు. వీఐపీలు ముందస్తుగా స్లాట్‌లో వస్తే ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రొటోకాల్ దర్శనం లభిస్తుందన్నారు. 13 శాఖలతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దసరా ఏర్పాట్లు గతంలో కంటే మెరుగ్గా చేపట్టేందుకు దేవాదాయ శాఖ చర్యలు తీసుకోవడం ప్రశంసనీయమన్నారు. అనంతరం కృష్ణమ్మకు హారతి అందించారు. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ సృజన, ఈవో రామారావు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం. 040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

దసరా నాటికి విజయ డెయిరీ పునరుద్ధరణ

చిట్టినగర్, న్యూస్‌టుడే



రిఫ్రిజిరేటర్ విభాగంలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



కేబుల్స్ విభాగంలో ఇలా..

విజయ డెయిరీ 60 ఏళ్ల చరిత్రలో ఏనాడు మూతపడలేదు. అలాంటిది బుడమేరు వరద వల్ల డెయిరీ ముంపునకు గురైంది. పది రోజుల పాటు ఫ్యాక్టరీలోని యంత్రాలు, ఇతర సామగ్రి నీటిలోనే ఉన్నాయి. బురద పట్టి యంత్రాలు తుప్పు పట్టి ఏ ఒక్కటీ పని చేయని పరిస్థితి. ఈ నేపథ్యంలో వరద వీడిన దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది, టెక్నీషియన్లు శరవేగంగా మరమ్మతులు చేస్తున్నారు. ఇందులో ప్రధానమైన, పాలను నిర్దిష్టమైన రీతిలో కూలింగ్ చేసే రిఫ్రిజిరేటర్ విభాగంలో 270 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన కంప్రెషర్లు దెబ్బతిన్నాయి. ప్యానల్ బోర్డులు పనికి రాకుండా పోయాయి. దీంతో వాటిని బాగు చేస్తున్నారు. ఎలక్ట్రికల్ విభాగం నీట మునగడంతో ప్యానల్ బోర్డులతో పాటు మెయిన్ కేబుల్స్ పాడయ్యాయి. భూగర్భంలో ఉన్న ఈ కేబుల్స్‌ను పూర్తిగా తనిఖీ చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్నారు.

కామధేను ఫ్యాక్టరీ ఆదుకుంది

దెబ్బతిన్న ఫ్యాక్టరీ గురించి 'న్యూస్‌టుడే'తో ఛైర్మన్ ఆంజనేయులు ఇలా మాట్లాడారు. వరదలో డెయిరీ మునిగిపోవడంతో 60 ఏళ్లు వెనక్కి వెళ్లాల్సి వచ్చేది. మార్కెట్ దెబ్బతింది. వినియోగదారులు విజయ పాలను మరచిపోయే పరిస్థితి దాపురించేది. రైతులు ప్రత్యామ్నాయం చూసుకునే వారు. పోటీ కంపెనీలు ఇదే అదునుగా మార్కెట్‌లో దూసుకుపోయేవి. మళ్లీ మొదలు నుంచి రావాల్సి వచ్చేది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ పాలక వర్గం నిర్ణయం మేరకు, పాల రైతుల సహకారంతో హనుమాన్ జంక్షన్ వీరవల్లిలో కామధేనువు పేరుతో కొత్తగా ఫ్యాక్టరీ నిర్మించడం వల్ల ఈ విపత్తు నుంచి బయటపడ్డాం. ఎక్కడా వినియోగదారుడికి, పాలరైతులకు ఇబ్బంది లేకుండా అక్కడ నుంచి పాలు, పాల పదార్థాలు, ఇతర వస్తువులను యథావిధిగా అందించడంతో ప్రజల్లో విజయ బ్రాండ్‌కు ఎలాంటి ఆటంకం రాలేదు. పాత ఫ్యాక్టరీ దసరా నాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసుకుని వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు.

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దసరా ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో కలిసి హాజరు కావల్సిందిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిలను దేవస్థానం ఈవో రామారావు వారి నివాసాలకు వెళ్లి మంగళవారం ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను అందజేయడంతో పాటు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు. ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు.



ఎంపీ శివనాథ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో రామారావు, పక్కన వైదిక కమిటీ సభ్యులు




పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరికి..

4న శాప్ నూతన ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) నూతన ఛైర్మన్‌గా అనిమిని రవినాయుడు ఈ నెల 4వ తేదీన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల శాప్ బోర్డు పదవీ కాలం ముగిసింది. శాప్ ఛైర్మన్‌గా రవినాయుడిని నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రవినాయుడు 4వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి హాజరుకానున్నారు.

యుగపురుషుడు ఎన్టీఆర్ : పురందేశ్వరి



పుస్తకం ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి, రచయిత పూర్ణచంద్రరావు, జయప్రకాష్ నారాయణ

భవానీపురం, న్యూస్‌టుడే : కలియుగంలో ఎంతో మంది పుణ్యాత్ములు జన్మించినా తన యశస్సునంతటిని భారత జాతిపై ప్రసరింపజేసిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. నగరంలోని ప్రసాద్ వి.పొట్లూరి సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆంగ్ల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి పూర్ణచంద్రరావు రచించిన 'ఎన్.టి.ఆర్.శతకం' పుస్తకాన్ని పురందేశ్వరి విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నో విభిన్నమైన పాత్రలకు సజీవరూపం కల్పించి ప్రేక్షకుల మనసుల్లో శాశ్వతముద్ర వేశారన్నారు. పరిపూర్ణమైన వ్యక్తిత్వానికి నిర్వచనం ఎన్టీఆర్ అని, అలాంటి గొప్ప వ్యక్తికి కుమార్తెగా జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడించారు. రచయిత పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తుల్లో ఎన్టీఆర్ ఒకరని తెలిపారు. అలాంటి వ్యక్తి గురించి పుస్తకం రాయడం సంతోషంగా ఉందన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు... ట్రాఫిక్ మళ్లింపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా.. నగరం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు ఈ మళ్లింపులు ఉంటాయని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

భారీ, చిన్న వాహనాలు ఇలా వెళ్లాలి..

☛ హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, స్వాతి కూడలి, కనకదుర్గా పైవంతెన, కృష్ణలంక, కనకదుర్గమ్మ వారధి, తాడేపల్లి మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

☛ హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను.. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. అదే విధంగా చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై.కూడలి, కబేలా సెంటర్, సీవీఆర్ పైవంతెన, పైపుల రోడ్డు, కండ్రిక, బోడపాడు ఆర్‌యూబీ, ఔటర్ రింగ్‌రోడ్డు, ముస్తాబాద, చిన అవుటపల్లి మీదుగా విశాఖపట్నం మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

☛ విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను హనుమాన్‌జంక్షన్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనమూడి వారధి, రేపల్లె, చీరాల, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గన్నవరం, నిడమానూరు, బెంజిసర్కిల్, కనకదుర్గమ్మ వారధి మీదుగా చెన్నైకు పంపిస్తారు. రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగితే.. తాడిగడప 100 అడుగుల రోడ్డు మీదుగా బందరురోడ్డు, అక్కడి నుంచి బెంజిసర్కిల్ మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెనుతిరుగుతాయి.

☛ గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను బుడంపాడు, తెనాలి, పెనుమూడి వారధి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు, విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గుంటూరు, కనకదుర్గమ్మ వారధి, బెంజిసర్కిల్ పైవంతెన, రామవరప్పాడు, నిడమానూరు, గన్నవరం మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.